
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

6

గురువారం 8 మే 2025





ఉష్ణోగ్రత (అంచనా) 8-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	26
తెనాలి	40	27
నరసరావుపేట	39	25
బాపట్ల	38	27
రెంటచింతల	39	26
చీరాల	38	27



శంకర్ విలాస్ ఆర్వోబీ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్రసహాయ మంత్రి పెమ్మసాని, మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు రామాంజనేయులు, నసీర్, మాధవి, శ్రావణ్ కుమార్, కలెక్టర్ నాగలక్ష్మి మేయర్ నాని, డేగల, మన్నవ మోహనకృష్ణ, కమిషనర్ తదితరులు

అద్భుతంగా ఆర్వోబీ నిర్మిస్తాం

- బ్రిడ్జి నిర్మాణంపై అపోహలు తొలగిస్తాం
- ఆరు నెలల్లోనే అనుమతులు సాధించుకోగలిగాం
- శంకర్ విలాస్ ఆర్వోబీ శంకుస్థాపనలో పెమ్మసాని

గుంటూరు(తూర్పు), మే 7 (ఆంధ్రజ్యోతి): 'శంకర్‌విలాస్ ఆర్వోబీ నిర్మాణం మూడేళ్లు పైనే పడుతుంది. ప్రజలు నిత్యనరకం చూస్తారు.. అని కొందరు పనిగట్టుకుని అసత్య ప్రచారాలు చేస్తున్నారు. అపోహలు నమ్మొద్దు.. అనుకున్న సమయం కంటే ముందుగానే అద్భుతంగా నిర్మాణం పూర్తి చేస్తాం..' అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక ఏసీ కళాశాల ఎదురుగా అంబేద్కర్ భవన్ సమీపంలో శంకర్‌విలాస్ ఆర్వోబీ పనులకు బుధవారం భూమిపూజ జరిగింది. శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కీలకమైన ఈ ప్రాజెక్టుకు దాదాపు 15 శాఖల నుంచి అనుమతులను ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సాయంతో కేవలం ఆరు నెలల్లోనే సాధించామన్నారు. సమష్టి కృషితో ఇది సాధ్యమైందన్నారు. ఆర్వోబీ నిర్మాణంలో ప్రజల్లో వస్తున్న అపోహలను తొలగించేలా కృషి చేస్తున్నామన్నారు. బ్రిడ్జి పొడవును 430 మీటర్ల నుంచి 930 మీటర్లకు పెంచామని చెప్పారు. హిందూ కళాశాల వద్ద బ్రిడ్జిని ప్రారంభిస్తే అక్కడ జంక్షన్ కారణంగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. నాజ్ సెంటర్‌కు వెళ్లే వారికి ఫ్రీ లెఫ్ట్ సదుపాయం కోల్పోయి ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. ఆర్‌యూబీ సాధ్యపడదని, ఏమైనా జరిగితే వందల రైళ్లకు నష్టం వాటిల్లుతుందన్నారు. నగరం మధ్యలో ఆరు లేన్ల వంతెన కట్టాలంటే భారీగా ఆస్తి నష్టం ఏర్పడవచ్చని చెప్పారు. అందుకే నాలుగులేన్ల బ్రిడ్జితో జీజీహెచ్, అరండల్‌పేట 4, 5 లేన్ల వద్ద అండర్ పాసులను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

తల తెగినా తప్పు చేయను

తల తెగినా పొరపాటున కూడా తప్పు చేయనని పెమ్మసాని చెప్పారు. ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే ఆర్‌వోబీ నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. వేగవంతంగా నాణ్యతతో ఆర్‌వోబీ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. దీంతో పాటు పెదపలకలూరు, నందివెలుగు, ఇన్నర్ రింగురోడ్డు ఆర్వోబీలు కూడా మంజూరు చేయించి టెండర్ దశకు తీసుకొచ్చినట్లు చెప్పారు. నందివెలుగు బ్రిడ్జి, ఇతర బ్రిడ్జిలతో పాటు ఇన్నర్ రింగురోడ్డు త్రీ ఫేజ్ విస్తరణ పనులను ప్రారంభించి మూడు నెలల్లోపే పూర్తి చేస్తామన్నారు. ఇన్‌చార్జ్ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ముందుచూపు, దార్శనికత కల్గిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉంటే అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, దారి మళ్లింపు కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. 14 నెలల్లో బ్రిడ్జిని పూర్తి చేసేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నామని మేయర్ కోవెలమూడి రవీంద్ర చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, నసీర్ అహ్మద్, తెనాలి శ్రావణ్‌కుమార్, నక్కా ఆనంద్‌బాబు, బూర్ల రామాంజనేయులు, ఇండస్ట్రియల్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్, ఏపీటీఎస్ కార్పొరేషన్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ, ఎస్సీ మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్‌నారాయణ, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, బోనబోయిన శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

సాంకేతిక విద్యకు.. నిధుల సమస్య!

ఉమ్మడి గుంటూరు జిల్లాకే తలమానికం నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల. ఏకైక ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల కూడా ఇదే. ప్రతిభ కలిగిన విద్యార్థులకు సాంకేతిక విద్య అంతంతమాత్రంగానే అందుతోంది. కళాశాలలో వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. నిధుల కొరత వెంటాడుతుండడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఏళ్ల తరబడి కళాశాల, వసతి గృహ భవనాల నిర్మాణాలు సాగుతూనే ఉన్నాయి.



- నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో వసతుల కొరత
- రూ.8 కోట్లు ఇస్తేనే వసతి భవనాల నిర్మాణం
- కళాశాల భవనాలకు రూ.30 కోట్లతో ప్రతిపాదనలు
- నిధులు మంజూరులో జేఎన్‌టీయూ మీనమేషాలు



సాగుతూనే ఉన్నాయి..

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల కాకినాడ జేఎన్‌టీయూ నిర్లక్ష్యానికి గురైంది. కళాశాలను అభివృద్ధి చేయడం యూనివర్సిటీ అధికారులకు ఇష్టం లేదన్నట్లుగా ఉంది. స్థానిక కళాశాలకు రూ.8 కోట్లు నిధులు విడుదల చేస్తేనే వసతి గృహాల నిర్మాణాలు పూర్తవుతాయి. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో కళాశాల, వసతి గృహ భవనాల నిర్మాణాలను పూర్తి చేయలేకపోయింది. కళాశాల భవనాలు కూడా అరకొరగానే పూర్తయ్యాయి. వసతిగృహాల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. అసంపూర్తి భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు.

నరసరావుపేట కళాశాల భవనాల నిర్మాణానికి కాకినాడ జేఎన్‌టీయూ రూ.90 కోట్లు మంజూరు చేసింది. రూ.28 కోట్లతో పరిపాలన, ప్రయోగశాలలు, తరగతి గదుల నిర్మాణాలను చేపట్టారు. ఆరేళ్లగా నిర్మాణ పనులను సాగదీస్తున్నారు. తరగతులు నిర్వహించేందుకు వీలుగా పనులు పూర్తి చేశారు. పూర్తిస్థాయి భవనాల నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయింది. మూడు ఫ్లోర్లలో రెండుఫ్లోర్లు మాత్రమే పూర్తి చేశారు. మరో అంతస్తు నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదు. దాదాపు రూ.30 కోట్లు నిధులు మంజూరు చేస్తేనే భవనాల నిర్మాణం పూర్తయ్యే పరిస్థితి ఉంది. ఈ దిశగా వర్సిటీ స్పందించడం లేదు. ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల లో చేరేందుకు విద్యార్థులు పోటీ పడతారు. అయితే వసతి సౌకర్యాలు లేకపోవడంతో ఆ పరిస్థితి ఇక్కడ కన్పించడం లేదు.

ప్రతిపాదనలు వెళ్లాయి.. నిధులు రావాలి

ఇటీవల జేఎన్‌టీయూ వీసీ కళాశాలను సందర్శించారు. వసతి గృహాల నిర్మాణం పూర్తి చేస్తామని విద్యార్థులకు ఆయన హామీ ఇచ్చారు. నరసరావుపేట నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కళాశాలకు రావడానికి విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వసతి గృహాలకు సంబంధించిన రివైజ్డ్ అంచనాలను వర్సిటీ అధికారులకు అందించామని సంబంధిత ఇంజనీర్ శ్రీనివాసరావు తెలిపారు. నిధులు కేటాయిస్తేనే వసతి గృహాలను రానున్న విద్యా సంవత్సరానికి వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు. కళాశాల మూడో అంతస్తుకు రివైజ్డ్ అంచనాలను రూపొందించి, వర్సిటీకి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు.



నిర్మాణంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్



అసంపూర్తిగా బాలికల వసతి గృహం

అక్రమ నిర్మాణాలు, పారిశుధ్యంపై వాడీవేడి చర్చ..

- పారిశుధ్యంపై కౌన్సిల్లో గళమెత్తిన ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు
- 374 అంశాలకు జీఎంసీ కౌన్సిల్ ఆమోదం

గుంటూరు కార్పొరేషన్, మే 7(ఆంధ్రజ్యోతి): నగరంలో బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలు, అధికారుల అవినీతి, నగరంలో తాగునీటి కుళాయిలకు మోటార్లు పెట్టాలని లేవనెత్తిన అంశంపై కౌన్సిల్లో గందరగోళ పరిస్థితులు.. జ్యోతిర్మయి అపార్ట్మెంట్ కు అడ్డగోలుగా పైప్ లైన్ ఏర్పాటు చేశారంటూ రగడ.. పారిశుధ్యంపై ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు పెద్ద ఎత్తున నిరసనతో బుధవారం గుంటూరు నగరపాలక సంస్థ సాధారణ సమావేశం వాడీవేడిగా సాగింది. నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర(నాని) అధ్యక్షతన సమావేశం మొత్తం 374 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. గుంటూరు నగరంలో గ్రీన్ గ్రేస్ అపార్ట్మెంట్, ఇన్నర్ రింగ్ రోడ్డులో హ్యాపీ నెస్ట్ నిర్మాణాలు అడ్డగోలుగా సాగుతున్నాయని కౌన్సిల్లో టీడీపీ కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాంప్రసాద్ ప్రశ్నించారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకోలేకపోతున్నామని వివరించారు. మరో కార్పొరేటర్ మల్లవరపు రమ్య నగర శివారులో అక్రమ నిర్మాణాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే మాధవి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పశ్చిమ నియోజకవర్గంలో వీధి దీపాలు, డ్రైయినేజీ నిర్వహణ, చెత్త సేకరణలో నిర్లక్ష్యం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తాము మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేస్తామంటే ట్రాఫిక్ ఆంక్షలు తెలిపిన.. నగరపాలక సంస్థ ఇప్పుడు అదే ప్రాంతాల్లో ఎల్ఈడీ డిస్ప్లే బోర్డులకు అనుమతులు ఎలా ఇచ్చారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఒక ఫ్లోర్ కు అనుమతి తీసుకొని ఐదు ఫ్లోర్లు నిర్మిస్తున్నా కూడా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని సమాధానం కోరారు.



కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న మేయర్ రవీంద్ర (నాని)

వాటర్ మీటర్లను ఏర్పాటు చేయండి

నగరంలో నీటి మీటర్లు ఏర్పాటు చేయాలని, దీంతో ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడతారని ఎమ్మెల్యేలు మాధవి, రామాంజనేయులు కోరారు. దీనిపై గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ ప్రాంతంలో అంతా పేద వాళ్లేనని, మీటర్లు పెట్టొద్దని కోరారు. కార్పొరేటర్ల అందరూ దీనిని సమర్థించారు. నగరంలోని జ్యోతిర్మయి అపార్ట్‌మెంట్‌కు అడ్డగోలుగా పైప్ లైన్ వేశారం టూ.. కార్పొరేటర్లు అచల వెంకటరెడ్డి, రోషన్ ఆరోపించారు. దీంతో ఏటి అగ్రహారంలోని అనేక ప్రాంతాల ప్రజల తాగునీటికి ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

పారిశుధ్యంపై ఆందోళన..

నగరంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందంటూ ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, రామాంజనేయులు, మాధవి, కార్పొరేటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై క్షేత్రస్థాయిలో చర్చ జరగాలని ఎమ్మెల్యే నసీర్ పట్టుబట్టారు. తూర్పుపశ్చిమ, విలీన గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, మెరుగు పరిచేందుకు ఈ నెల 20న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కౌన్సిల్ తీర్మానించింది. ఎమ్మెల్యే రామాంజనేయులు గోరంట్ల కొండపైన తాగునీటి పథకం పనులు ఎప్పుడు పూర్తి చేస్తారో తెలపాలని పట్టుబట్టారు. దీనిపై సీఎంహెచ్ఓ డాక్టర్ అమృతం సమాధానం ఇస్తుండగా.. మేయర్ రవీంద్ర అసహనం వ్యక్తం చేశారు. అమ్మ మీరు చాలా యాక్టివ్‌గా ఉండాలి అంటూ సున్నితంగా మందలించారు. 374 అంశాలకు కౌన్సిల్ ఆమోదం ముద్ర వేస్తూ మేయర్ రవీంద్ర ప్రకటించారు.



కౌన్సిల్‌లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మాధవి, రామాంజనేయులు, నసీర్, ఎమ్మెల్సీ ఏసురత్నం

రైస్ కార్డుల పండుగ




- ఏళ్ల తరబడి నిరీక్షణకు తెర.. లబ్ధిదారుల్లో సంతోషం
- కొత్తకార్డులు సహా.. 6 రకాల మార్పుచేర్పులకు అవకాశం
- హౌస్‌హోల్డ్ మ్యాపింగే కీలకమంటున్న అధికారులు
- వచ్చే నెల 6వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం

8

రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు 50 శాతం పూర్తి



- రేపల్లె స్టేషన్‌లో పనులు పరిశీలించిన డీఆర్‌ఎం సుధేష్ణసేన్
- 22 బోగీలతో రేపల్లె టు తిరుమల రైలు



ఒకే సారి అంటే కష్టమే

- నాలుగు ఆర్వోబీల నిర్మాణం మొదలైతే ఎలా?
- ప్రతిపాదిత ట్రాఫిక్ ప్రణాళిక సజావుగా అమలయ్యేనా

గుంటూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): ఇంచుమించుగా రెండు, మూడు నెలల వ్యవధిలో గుంటూరు నగర పరిధిలోని నాలుగు రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద బ్రిడ్జిల నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. శంకర్‌విలాస్ ఆర్వోబీకి బుధవారం శంకుస్థాపన జరగ్గా మరికొద్ది రోజుల్లో నందివెలుగు రోడ్డు ఆర్వోబీ పెండింగ్ పనులు, ఇన్నర్ రింగురోడ్డు, పెదపలకలూరు రోడ్డు ఎల్‌సీ గేటు వద్ద ఫ్లైవోవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలు కానున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసు, నగరపాలక సంస్థలు గతంలో ట్రాఫిక్ మళ్లింపుపై ప్రణాళికలు రూపొందించాయి. అయితే ఇప్పుడు కొత్తగా మరో మూడు వంతెనల పనులు వస్తున్న నేపథ్యంలో ప్రణాళికలను మార్పు చేసుకోవాలి. లేకుంటే నగరంలోకి ప్రవేశించాలన్నా, వేరే ఊళ్లకు వెళ్లాలన్నా వాహన చోదకులకు నరకయాతనే. శంకర్‌విలాస్ ఆర్వోబీ నిర్మాణం కారణంగా ప్రస్తుతం ఉన్న బ్రిడ్జిని కొన్ని నెలల్లో కూల్చేసి ట్రాఫిక్‌ను మళ్లిస్తారు. ట్రాఫిక్ మళ్లింపులకు సంబంధించి ప్రణాళికలన్నీ కేవలం శంకర్‌విలాస్ ఆర్వోబీని దృష్టిలో పెట్టుకుని చేసినవే. కాగా నందివెలుగు ఆర్వోబీ పెండింగ్ వర్కులను పూర్తి చేసేందుకు టెండర్లు పిలిచారు.

ఇన్నర్‌రింగురోడ్డులో నాలుగు వరసలు, పలకలూరు రోడ్డులో రెండు వరసల ఆర్వోబీల నిర్మాణానికి రైల్వే శాఖ టెండర్లు పిలిచింది. వీటిని పరిగణనలోకి తీసుకుంటే ఏకకాలంలో నాలుగు ఆర్వోబీల నిర్మాణాలు జరుగుతుంటాయి. ఆ పరిస్థితుల్లో ఇన్నర్ రింగురోడ్డు, పలకలూరు రోడ్డు, నందివెలుగురోడ్డులో బ్రిడ్జిలకు పక్కనే రైల్వేట్రాక్‌ల వద్ద తాత్కాలికంగానైనా ఎల్‌సీ గేట్లు పక్కకు మార్చాలి. లేకుంటే హైదరాబాద్, నరసరావుపేట, మంగళగిరి రోడ్డు వైపు నుంచి వచ్చే వాహనాలు, ఆయా రోడ్లలోకి నగరంలో నుంచి వెళ్లాలన్నా సమస్యలు ఉత్పన్నమౌతాయి.

ఉత్కంఠగా.. మాక్‌డ్రిల్

గుంటూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వేస్టేషన్ ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాంపై బాంబు పేలింది.. ఆ వెంటనే పెద్దపెట్టున సైరన్ మోగింది.. దీంతో అక్కడున్న వారు నేలపై బోర్లా పడుకున్నారు. ఇంతలో వైద్య సేవల సిబ్బంది గాయపడిన వారిని తరలించారు. పేలుడు సమాచారంతో రంగంలోకి దిగిన బాంబుస్క్వాడ్ రంగంలోకి దిగి పేలుడు పదార్థాల గుర్తింపు.. వాటిని నిర్వీర్యం చేసింది. మొదట భీతిల్లిన ప్రయాణికులు, స్థానికులు ఆ తర్వాత అది మాక్‌డ్రిల్ అని తెలుసుకుని ఊపిరిపీల్చుకున్నారు. ఇలా బుధవారం ఆద్యంతం ఉత్కంఠగా మాక్‌డ్రిల్ సాగింది. ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి, ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితులకు అనుగుణంగా అత్యవసర పరిస్థితుల్లో, యుద్ధ సమయాల్లో పౌరులు పాటించాల్సిన స్వీయ రక్షణ ముందు జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పిస్తూ ఆర్టీసీ బస్టాండ్‌లో ఏఎస్పీ(ఏఆర్) హనుమంతు ఆధ్వర్యంలో, రైల్వేస్టేషన్‌లో ఏఎస్పీ(అడ్మిన్) రమణమూర్తి ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. రైల్వేస్టేషన్‌లో జరిగిన మాక్‌డ్రిల్‌లో ఎస్పీ సతీష్‌కుమార్ పాల్గొని పరిశీలించారు. తొలుత ఏఎస్పీ రమణమూర్తి పోలీస్, రెవెన్యూ, ఆరోగ్య, అగ్నిమాపక శాఖల అధికారులకు, సిబ్బందికి మాక్‌డ్రిల్ గురించి వివరించారు. మొదటగా మోగిన ప్రమాద హెచ్చరిక సైరన్‌తో ప్రత్యేక బలగాల సిబ్బంది సామాన్య పౌరుల వలే స్వీయ రక్షణ కొరకు నేలపై పడుకుని చెవులను మూసుకుని బోర్లా పడుకున్నారు. ఘటనలో గాయపడిన వారిని అత్యవసర వైద్య సేవల సిబ్బంది అంబులెన్స్‌లోకి తీసుకువెళ్లారు. ఆ వెంటనే ప్రమాదకర వస్తువులు, పేలుడు పదార్థాలను కనిపెట్టే బాంబు స్క్వాడ్ తనిఖీలు చేపట్టి, పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేసింది. ఈ మాక్‌డ్రిల్‌లో ఆయా శాఖల వారితో పాటు ప్రయాణికులు, పౌరులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు. అవాంఛనీయ ఘటన జరిగినప్పుడు స్వీయ రక్షణ, బాధితుల తరలింపు, పేలుడు పదార్థాల గుర్తింపుపై ఎస్పీ అవగాహన కల్పించారు. విపత్కర పరిస్థితుల్లో ఎవరికి ఎటువంటి ప్రమాదం సంభవించకుండా చూడడమే ముఖ్య ఉద్దేశంగా మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు ఎస్పీ తెలిపారు. విపత్కర సమయాల్లో అత్యవసర సేవలకు సంబంధించి ఆయా శాఖల వారు ప్రజలకు అందుబాటులో ఉంటారనే సందేశాన్ని కూడా మాక్‌డ్రిల్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో రైల్వేస్టేషన్‌లో డీఎస్పీ అరవింద్, రైల్వే డీఎస్పీ అక్కేశ్వరరావు, ఆర్టీసీ బస్టాండ్ వద్ద డీఎస్పీ అబ్దుల్‌అజీజ్ తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు రైల్వే స్టేషన్‌లో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు



త్వరలో ఇన్నర్ రింగురోడ్డు విస్తరణ పనులు

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్


నిర్మాణాల తొలగింపు పనులను పరిశీలిస్తున్న చంద్రశేఖర్, రామాంజనేయులు, పులి శ్రీనివాసులు తదితరులు

గుంటూరు(తూర్పు), మే 7 (ఆంధ్రజ్యోతి) : ఇన్నర్ రింగు రోడ్డు విస్తరణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్-3 పనుల్లో భాగంగా శిల్పారామం వద్ద నివాసాల కూల్చివేత పనులను ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ పల్నాడు నుంచి వచ్చే వాహనాలను ట్రాఫిక్‌ను దారి మళ్లించేందుకు ఈ రోడ్డును డిజైన్ చేశారని చెప్పారు. బాధితులకు పరిహార ప్రక్రియ దాదాపు పూర్తయిందని, త్వరలోనే టెండర్లను పిలిచి నిర్మాణాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. కొత్తగా రాబోయే ఔటర్ రింగ్ రోడ్డుకు ఈ రహదారి అనుసంధానంగా ఉంటుందని అన్నారు. నివాసాలు, ఉపాధి కోల్పోయిన వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బూర్ల రామాంజనేయులు, మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం చేయడం ద్వారా బయట నుంచి వచ్చిన ప్రయాణికులు రాజధాని అమరావతి చేరుకోవడానికి 24 కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుందన్నారు. సొంత నివాసాలతో పాటు ఆక్రమణ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి కూడా పరిహారం అందజేశామని చెప్పారు. మిగిలిన బాధితులకు త్వరలోనే పరిహారం చెల్లిస్తామన్నారు. కార్యక్ర మంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, స్థానిక నాయకులు గింజుపల్లి వెంకటే శ్వరరావు, కల్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మోదీ ఉన్నంతవరకు దేశ ప్రజలు ప్రశాంతంగా నిద్ర పోవచ్చు

● కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు(తూర్పు), మే 7 (ఆంధ్రజ్యోతి): భారత దేశానికి ప్రధానిగా నరేంద్రమోదీ ఉన్నంత వరకు ప్రజలంతా ప్రశాంతంగా నిద్ర పోవచ్చని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ అన్నారు. బుధవారం సాయంత్రం గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. భారత ప్రధాని చాలా సమర్థవంతంగా పనిచే యగల వ్యక్తని, దేశ క్షేమం కోసం పనిచేయడమే లక్ష్యంగా ఆయన పరిపాలన కొనసాగిస్తున్నారని చెప్పారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌పై వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకొని ప్రధాని మోదీ ముందుకు వెళుతున్నారన్నారు. ఉగ్రవాదుల స్థావరాలపై సైనిక చర్యల దృష్ట్యా మన దేశ ప్రజలు ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు దేశ పరిస్థితి ఎలా ఉందో, ఇప్పుడు ఏ విధంగా ఉందనే విషయాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో దేశం పరిస్థితి చిన్నాభిన్నమైన సంగతి అందరికి తెలిసిందేనన్నారు. రాహుల్‌గాంధీకి దేశ పరిస్థితి తెలిసి ఉంటే ఇలా ఎందుకు ఉండేవాడంటూ ఎద్దేవా చేశారు. ఇప్పుడు కాదు... మోదీ ఉన్నంత వరకు భారత దేశానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని భరోసా ఇచ్చారు.

బుడంపాడు సబ్ స్టేషన్ ప్రారంభం

గుంటూరు, మే 7(ఆంధ్రజ్యోతి): గుంటూరు టౌన్-1 డివిజన్ పరిధిలోని బుడంపాడు సబ్‌స్టేషన్‌ను కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు చేతుల మీదుగా బుధవారం ప్రారంభోత్సవం జరిగింది. ముందుగా సబ్‌స్టేషన్ శిలాఫలకాన్ని ప్రారంభించిన వారు తరువాత లైట్లను స్విచ్ ఆన్‌చేసి ప్రారంభించారు. రూ.4.5 కోట్ల అంచనా వ్యయంతో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ ప్రస్తుతం విద్యుత్ వినియోగం రోజు రోజుకు పెరుగుతోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ నూతన సబ్‌స్టేషన్‌తో బుడంపాడుతో పాటు పరిసర ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందన్నారు. గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి, ఆపరేషన్ ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా, నష్టాలను నివారించటం జరుగుతుందన్నారు.


స్విచ్ ఆన్ చేసి బుడంపాడు సబ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే రామాంజనేయులు, ఎస్ఈ మూర్తి, ఈఈ శ్రీనివాసబాబు తదితరులు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

పనులు పూర్తి చేసి ఉన్న బుడంపాడు సబ్ స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకురాకపోవటంపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'బుడంపాడు సబ్‌స్టేషన్ ప్రారంభానికి గ్రహణం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. గతంలోనూ అధికారుల నిర్లక్ష్యంపై కథనం వెలువడింది. దీనిపై స్పందించిన అధికారులు బుడంపాడు సబ్‌స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం : పెమ్మసాని

గుంటూరు(తూర్పు), మే 7 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీ విశ్వకర్మ యోజన, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ వంటి అనేక పథకాలు తీసుకొచ్చి విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి అన్ని విధాలుగా సహకరిస్తున్నారని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. స్థానిక అమరావతి రోడ్డులో జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 332వ ఆరాధన, గురుపూజ మహోత్సవాల్లో బుధవారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం కార్యదర్శి ఉమ్మడోజు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉత్సవాల్లో పాల్గొని జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఏపీఐఐసీ చైర్మన్ డేగల ప్రభాకర్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సింహాద్రి సత్యనారాయణ, కమిటీ సభ్యులు గట్టి శ్రీనివాసరావు, వాలిచర్ల ప్రసాద్, మేడూరి శివరామబ్రహ్మం, ఆలయ ఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్‌ని బెదిరిస్తున్న అధికారులు

● ఏపీ ఎంసీఏ జిల్లా అధ్యక్షురాలు ప్రవళిక

గుంటూరు సిటీ, మే 7 (ఆంధ్రజ్యోతి) : డిమాండ్ల సాధన కోసం పోరాటం చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్‌ను కొందరు అధికారులు బెదిరిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు తమనంపల్లి ప్రవళిక ఆరోపించారు. ఏపీ ఎంసీఏ ఆధ్వర్యంలో గుంటూరులోని కలెక్టర్ కార్యాలయం ఎదురు కళ్లకు గంతలు కట్టుకొని జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు ప్రవళిక మాట్లాడుతూ సర్వీస్ క్రమబద్ధీకరణ, జీతాల పెంపు, బకాయిల చెల్లింపు వంటి డిమాండ్స్ పరిష్కరించే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ పోరాటానికి తమ మద్దతు పూర్తిగా ఉంటుందని సీఐటీయు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణరావు, నేతాజీ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.లింగ రాజు, వైస్ ప్రెసిడెంట్ జి.వనజ, షరీఫ్, ముస్తఫా, దివ్య వాణి పాల్గొన్నారు.



గుంటూరు కలెక్టర్ కార్యాలయం ఎదురు నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్

ఉద్యోగులు మానసిక స్థైర్యంతో విధులు నిర్వహించాలి

గుంటూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులు మానసిక స్థైర్యంతో విధులు నిర్వహించాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు సూచించారు. రేపల్లె 1వ వార్డు సచివాలయం హెల్త్ సెక్రటరీ సింగోటి కోటేశ్వరమ్మ ఆత్మహత్యను చింతిస్తూ బుధవారం ఏపీ ఎన్జీవో అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సారధ్యంలో గుంటూరులో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉద్యోగస్తులు అందరూ మానసిక స్థైర్యంతో ఉండాలని తెలిపారు. కార్యదర్శి ఆరాధ్యుల శ్యామ్ సుందర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు సంభవించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సురేపల్లి రాజశేఖర్, జిల్లా సంయుక్త కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, బి.కృష్ణ కిషోర్, కె.విజయబాబు, యం.విజయలక్ష్మి, మహిళా జాయింట్ సెక్రెటరీ కె.శివ జ్యోతి, నగర అధ్యక్షుడు ఎస్సీఎస్ సూరి, సహాధ్యక్షులు బి.సాంబశివరావు, నగర కోశాధికారి జి.వి.కోటేశ్వరావు, మంగళగిరి అధ్యక్షుడు కె.శ్రీరాములు, అమరావతి కార్యదర్శి కరీం, మాజీ జిల్లా మహిళా విభాగ చైర్మన్ రాధా రాణి, కన్వీనర్ రమ్య, నగర మహిళా విభాగ చైర్మన్, కన్వీనర్ ప్రసన్న, విజయ లక్ష్మి, ఎంపీహెచ్వో సీహెచ్వో జిల్లా అధ్యక్షులు శేషగిరి, ఇతర మహిళా విభాగ కార్యవర్గ సభ్యులు, సచివాలయ హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.


హెల్త్ సెక్రటరీ మృతికి చింతిస్తూ గుంటూరులో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు

● జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు సిటీ, మే 7 (ఆంధ్రజ్యోతి) : బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మహనీయుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో జరిగిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు సాయుధ పోరాటాన్ని ఎంచుకుని బ్రిటిష్ వారికి కంటి మీద కునుకు లేకుండా చేశారని నివాళులర్పించారు. అకౌంట్స్ ఆఫీసర్ పుల్లగూర శామ్యూల్ పాల్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చేసిన త్యాగం మరువరానిది అన్నారు. పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ కూచిపూడి మోహన్‌రావు, ఏవో రత్నం బాబు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం అన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు తోట ఉషాదేవి, సూపరింటెండెంట్ నిర్మల భారతి పాల్గొన్నారు.


అల్లూరి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఉద్యోగులు

మన్యం వీరుడు అల్లూరి

గుంటూరు(తూర్పు), మే 7(ఆంధ్రజ్యోతి) : బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన విప్లవ జ్యోతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకే ఎంఎస్), భారత కార్మిక సంఘం సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) నాయకులు కొనియాడారు. బుధవారం అల్లూరి వర్ధంతి సందర్భంగా నాజ్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి వారు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు గనిరాజు, కృష్ణ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన దమనకాండను తక్షణమే నిలిపివేసి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్.పోతురాజు, శ్రీచైతన్య, గంధం శ్రీను, ఖాజా, మోహన్, జి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి పాలకుల దోపిడీపై పోరాడటమే అల్లూరికి నివాళి

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు


నివాళులర్పిస్తున్న లక్ష్మణరావు, లక్ష్మణరెడ్డి తదితరులు

గుంటూరు కార్పొరేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : నేడు భారతదేశంలో పాలకుల దోపిడీపై అవిశ్రాంత పోరాటం చేయడమే అల్లూరి సీతారామరాజుకు ఘనమైన నివాళి అర్పించడమని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. నాజ్ సెంటర్‌లో గల అల్లూరి సీతారామరాజు కాంశ్య విగ్రహానికి అవగాహన ఆధ్వర్యంలో పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ దోపిడికి వ్యతిరేకంగా గిరిజనులను ఐక్యం చేసి స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ ఆనాటి బ్రిటిష్ పాలనలో జరిగిన దోపిడీ కన్నా 100 రెట్లు దోపిడీ నేడు కొనసాగుతుందని, సహజ వనరులను, అటవీ సంపదను నేటి పాలకవర్గాల ప్రతినిధులు, కార్పొరేట్ సంస్థలు దోచుకుంటున్నారని అన్నారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ప్రసంగిస్తూ సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి, ఉద్యమించి ప్రాణాలర్పించిన యోధుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ యోగ గురువు అచ్యుత ఇందుశేఖర్, అవగాహన సభ్యులు ఎల్.మురళీకృష్ణ, ఎస్.కృష్ణారావు, ఇ.చంద్రయ్య, ఆర్.వెంకటరత్నం నివాళులర్పించారు.

'ఈ శ్రమ్' కార్మికులకు అత్యంత ప్రయోజనకరం

గుంటూరు(తూర్పు), మే 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఈ శ్రమ్' అ సంఘటిత రంగంలో కార్మికులకు వరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సయ్యద్ జియావుద్దీన్ అన్నారు. స్థానిక వాసవి క్లాత్ మార్కెట్‌లో బుధవారం కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఈ శ్రమ్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదైన కార్మికుడికి ప్రమాదం లేదా మరణించిన బాధిత కుటుంబానికి రూ.2 లక్షలు అందుతాయని వివరించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్యానల్ న్యాయవాది కట్టా కాళిదాసు మాట్లాడుతూ ఈఎస్ఐ, ఈపీఎఫ్, ఐటీ చెల్లించని వారు, నెలకు రూ.1,50,000 ఆదాయం ఉన్న వారు ఈ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకోవాలని అన్నారు. ఉప కార్మిక కమిషనర్ గాయత్రిదేవి మాట్లాడుతూ 16-59 సంవత్సరాల మధ్య ఉన్న ప్రతి కార్మికుడు తమ పేర్లును ఈ శ్రమ్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యాపారులు, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పాదుకా పట్టాభిషేకంపై ప్రవచనం

గుంటూరు(తూర్పు), మే 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై బుధవారం పాదుకా పట్టాభిషేకంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మల్లాది కైలాసనాథ్ ప్రవచిస్తూ అయోధ్యకాండలో అనేక ధర్మసూక్ష్మాలు మనకు తెలియవస్తాయని చెప్పారు. తెల్లవారితే పట్టాభిషేకం అన్నప్పుడు, అరణ్యాలకు వెళ్ళాలి అన్నప్పుడు, రెండు సందర్భాలలో కూడా శ్రీరాముడు ఒకే విధంగా ఉన్నాడని, ఇది ధైర్యవంతుడి లక్షణమన్నారు. నేటి యువత శ్రీరాముడు చూపించిన ఈ లక్షణాలు తప్పక నేర్చుకోవాలన్నారు.

రవీంద్రుని సాహిత్యాన్ని నేటి తరం అధ్యయనం చేయాలి

గుంటూరు, మే 7(ఆంధ్రజ్యోతి): విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ సాహిత్యాన్ని, ఆ సాహిత్యం ఇచ్చే సంస్కారాన్ని తెలుసుకోవటం ఇప్పటి తరానికి ఎంతైనా అవసరమని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఠాగూర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఠాగూర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్.సదాశివం, నరసింహరావు, జనార్ధనరావు, పీటర్ తదితరులున్నారు.

అథ్లెటిక్ కోచ్‌లకు ఘన సత్కారం


సత్కారం పొందిన అథ్లెటిక్ కోచ్‌లతో డీఎస్‌డీవో నరసింహారెడ్డి

గుంటూరు (తూర్పు), మే 7(ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో స్థానిక బీఆర్ స్టేడియంలో వరల్డ్ అథ్లెటిక్ డే పురస్కరించుకుని అథ్లెటిక్ కోచ్‌ల ఘన సత్కార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి నరసింహారెడ్డి హాజరై కోచ్‌లను సత్కరించి ప్రసంగించారు. జిల్లా నుంచి క్రీడాకారులను తయారు చేస్తున్న శిక్షకులను సత్కరించుకోవటం అభినందనీయమని తెలిపారు. అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ వరల్డ్ అథ్లెటిక్స్ డే సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించుకోవటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి కోసనా వేణుగోపాల్, అధ్యక్షుడు వెంకటరెడ్డి, వేణు అకాడమీ డైరెక్టర్ వేణు, కే అరుణ్ కుమార్, ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, సీఐ శివ ప్రసాద్

ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

● 16 వాహనాల స్వాధీనం

గుంటూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను లాలాపేట పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని ఇస్మాయిల్ పేటలో ఉంటున్న.. చిలకలూరిపేట గుర్రాల చావిడి ప్రాంతానికి చెందిన షేక్ సుభాని, విజయవాడ యనమలకుదురు లాకుల వద్ద ఉంటున్న.. హైదరాబాదులోని గాజులరామారం సుభాష్ చంద్రబోస్ నగర్‌కు చెందిన పఠాన్ ను అదుపులోకి తీసుకున్నారు. బుధవారం లాలాపేట పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి, ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, సీఐ ఏవీ శివప్రసాద్ వివరాలు వెల్లడించారు. నిందితులిద్దరూ.. ఏడాదిగా చెడు వ్యసనాలకు బానిసలై.. డబ్బులు కోసం ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతున్నారు. అనంతరం వాటిని ఓఎల్ఎక్స్ ద్వారా విక్రయిస్తున్నారు. పాత గుంటూరు, లాలాపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో సుమారు 15 ద్విచక్ర వాహనాలు అపహరించారు. నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ద్విచక్ర వాహనం చోరీ చేశారు. వాటిని ఆటోనగర్ వద్ద రహస్య ప్రాంతంలో దాచారు. నిందితులిద్దరూ మాయాబజార్ సెంటర్ లో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో లాలాపేట ఎస్సై ఆర్ఎం విజయకుమార్ వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతున్నట్లు నిందితులు వెల్లడించారు. వారి నుంచి 16 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ శివప్రసాద్, ఎస్ఐ విజయకుమార్ కానిస్టేబుళ్లు కిరణ్, శంకర్‌ను డీఎస్పీ అభినందించారు.

అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

● రూ.5 లక్షల సొత్తు, రూ.1.05 లక్షల నగదు స్వాధీనం

కొత్తూరు (అనకాపల్లి), మే 7 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలు ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన దొంగల ముఠాను అనకాపల్లి పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి రూ.5 లక్షల సొత్తు, లక్షకుపైగా నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. అనకాపల్లి రూరల్ పోలీసులు బుధవారం సాయంత్రం మండలంలోని మారేడుపూడి కూడలిలో గస్తీ నిర్వహిస్తుండగా ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా అక్కడ కనిపించారు. వారి వద్ద ఉన్న లగేజీని తనిఖీ చేయగా బంగారం, వెండి వస్తువులు, పట్టుచీరలు, ఎలక్ట్రానిక్ వస్తువులు కనిపించాయి. దీంతో పోలీసులు తమదైన శైలిలో విచారణ జరపగా, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల చోరీలకు పాల్పడినట్టు చెప్పారు. వీరు పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం మాదల గ్రామానికి చెందిన తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, గుంటూరు నగరంలోని లక్ష్మీపురం ప్రాంతానికి చెందిన ఉప్పల సురేశ్, విజయవాడ ఆంధ్రప్రభ కాలనీకి చెందిన కందివలస నరసింహారావు, తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా అడుసుమల్లి మండలానికి చెందిన ఉరిడి జనార్దన్, గుంటూరు సాంబయ్యకాలనీకి చెందిన కంకణాల సుభాశ్‌లుగా గుర్తించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్న వీరి నుంచి రెండుంపావు తులాల బంగారం, రెండు కిలోల వెండి వస్తువులు, రూ.1.05 లక్షల నగదు, ల్యాప్‌టాప్, ఐ ఫోన్, తొమ్మిది పట్టు చీరలను పోలీసులు సీజ్ చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకుని చోరీ సొత్తు స్వాధీనం చేసుకోవడంలో ప్రధాన పాత్ర పోషించిన రూరల్ సీఐ జి.అశోక్‌కుమార్, ఎస్ఐ జి.రవికుమార్, అదనపు ఎస్ఐ జె.నాగేశ్వరరావు, ఏఎస్ఐ భాస్కరరావు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.


దేవదాయ శాఖ డీసీతో సమావేశమైన ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

ఆలయాలను సంరక్షించండి

● దేవాలయ భూములను కాపాడండి

● ఎండోమెంట్ డీసీతో ఎమ్మెల్యే నసీర్

గుంటూరు కార్పొరేషన్, మే 7(ఆంధ్రజ్యోతి) : భారతదేశం వేద భూమి అని, ఆలయాల సంరక్షణ బాధ్యత అందరిపై ఉందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. దేవదాయ శాఖ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావుతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేవాలయాల అభివృద్ధి, పునరుద్ధరణ కోసం రూ.134 కోట్ల రూపాయలు కేటాయించినట్లు తెలిపారు. దేవాలయాల భూముల రికార్డుల డిజిటలైజేషన్ పక్కాగా ఉండాలన్నారు. రాష్ట్రంలో ఆక్రమణకు గురైన దేవదాయ భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఆదాయం లేని దేవాలయాలు, వాటి పరిధిలో నిర్వహించే కల్యాణ మండపాలు, సత్రాల అభివృద్ధికి సీఎస్ఆర్ ఫండ్స్ వినియోగిస్తామని చెప్పారు. తద్వారా భక్తులకు మెరుగైన సేవలందించే అవకాశం కలుగుతుందన్నారు. ఆలయాల జీర్ణోద్ధరణ ద్వారా ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుందని చెప్పారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక బాలాలయం నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. దేవాలయాల్లో భద్రతను పెంచడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, వేసవిలో మంచినీరు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. టెంపుల్ టూరిజాన్ని అభివృద్ధి చేయాలని చెప్పారు.

'ఆపరేషన్ సిందూర్' సైనికుల దృఢ సంకల్పానికి ప్రతీక

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ


విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

గుంటూరు(తూర్పు), మే 7(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ భారత సైనిక బలగాల దృఢ సంకల్పానికి ప్రతీకని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ అన్నారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్‌తో బుద్ధి చెప్పిన భారత సైన్యానికి మద్దతు తెలుపుతూ బుధవారం స్థానిక శంకర్‌విలాస్ సెంటర్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షత వహించారు. జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను వీరోచితంగా ధ్వంసం చేసిన మన సైన్యం శక్తిసామర్థ్యాలకు దేశం గర్విస్తుందని అన్నారు. జాతీయ కౌన్సిల్ సభ్యుడు జూపూడి రంగరాజు మాట్లాడుతూ భారత్ సైన్యానికి మద్దతుగా దేశప్రజలు ఉండాలని అన్నారు. కార్యక్ర మంలో ఈదర శ్రీనివాసరెడ్డి, పి.రవికుమార్, కుమార్ గౌడ్, వెలగలేటి గంగాధర్, షేక్ రఫీ, షేక్ ఫరా నా, షేక్ అబ్దుల్ ఖుద్దుస్ పాల్గొన్నారు.

జిన్నాటవర్‌కు కలాం పేరు పెట్టాలి

● బీజేపీ తూర్పు కన్వీనర్ ఉమాశంకర్ డిమాండ్

గుంటూరు మెడికల్, మే 7 (ఆంధ్రజ్యోతి): నగరం నడిబొడ్డున ఉన్న జిన్నాటవర్ సెంటర్‌కు ఆ పేరును తొలగించి ఆ స్థానంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ పేరిట నామకరణం చేయాలని భారతీయ జనతా పార్టీ గుంటూరు తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసేందుకు చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా జాతీయ జెండాలతో సంఘీభావం తెలుపుతూ డాక్టర్ ఉమాశంకర్ నేతృత్వంలో బుధవారం సాయంత్రం నాజ్ సెంటర్‌లోని మాజీ ప్రధాని వాజ్‌పేయి విగ్రహం దగ్గర సంఘీభావ ప్రదర్శన జరిపారు. పాకిస్తాన్ చర్యకు ప్రతి చర్య ఉంటుందని మోదీ తెలిపారన్నారు. దానికి అనుగుణంగా పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు జరిపినట్లు తెలిపారు. దేశంలోని ప్రసిద్ధ కట్టడాలకు పాకిస్తాన్ నాయకులతో ఉన్న పేర్లను తొలగించాలని, వాటికి భారతీయుల పేర్లను పెట్టాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేస్తున్నట్లు ఉమాశంకర్ తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చెరుకూరి తిరుపతిరావు, మలిశెట్టి పవన్ కుమార్, కుద్దూస్, సురేష్‌కుమార్ జైన్, రఫీ, నాగేశ్వరరావు, భజరంగ్ రామకృష్ణ, కామేపల్లి వెంకటేశ్వర్లు, జితేంద్ర గుప్తా, మనోజ్, అనిల్‌బాబు, కొనకళ్ల సత్యం, శనక్కాయల శివరామ హైమావతి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావ ప్రదర్శనలో డాక్టర్ ఉమాశంకర్ తదితరులు

ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై హర్షం

గుంటూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ ఉగ్రవాదంపై భారత్ ఆపరేషన్ సిందూర్ పేరుతో చేసిన ఆపరేషన్ విజయవంతం కావటంపై వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ షేక్ గులాం రసూల్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పాకిస్తాన్ ఉగ్రవాదులు చేసిన ఘాతుకానికి సరైన సమయంలో భారత్‌బలగాలు బుద్ధి చెప్పటం ముదావహమన్నారు. మరలా మన దేశం వైపు ఎవరు చూడాలన్నా భయపడేలా కఠినంగా వ్యవహరించాలన్నారు. అప్పుడే పహల్గాం దాడిలో మృతులకు నిజమైన నివాళి అవుతుందన్నారు. భారత బలగాలకు తాను ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.

20న మున్సిపల్ కార్మికుల సమ్మె

గుంటూరు కార్పొరేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా ఈనెల 20వ తేదీన మున్సిపల్ కార్మికులు సమ్మెలో పాల్గొంటారని మునిసిపల్ జేఏసీ నాయకులు తెలిపారు. సమ్మె నోటీసును బుధవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులకు అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ జేఏసీ నాయకులు కోట మాల్యాద్రి, వరికల్లు రవికుమార్, ముత్యాలరావు, ఏఐటీయూసీ నగర అధ్యక్ష కార్యదర్శులు అంజిబాబు, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు మీదగా చర్లపల్లి, బరంపురం ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా చర్లపల్లి, బరంపురం ప్రత్యేక రైళ్లను ఈ నెల, జూన్‌లో వారానికి ఒకసారి నడపనున్నట్లు గుంటూరు డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. (07027) చర్లపల్లి - బరంపురం ప్రత్యేక రైలు ఈ నెల 9, 16, 23, 30, జూన్ 6, 13, 20, 27 తేదీల్లో(ప్రతీ శుక్రవారం) రాత్రి 8.15 గంటలకు బయలుదేరి 11.44కి సత్తెనపల్లి, అర్ధరాత్రి దాటాక 12.40కి గుంటూరు, శనివారం మధ్యాహ్నం 2.15కి బరంపురం చేరుకుంటుంది. (07028) బరంపురం - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 10, 17, 24, 31, జూన్ 7, 14, 21, 28 తేదీల్లో(ప్రతీ శనివారం) సాయంత్రం 4.45 గంటలకి బయలుదేరి ఆదివారం వేకువజామున 4.33 గంటలకు గుంటూరు, 5.23కి సత్తెనపల్లి ఉదయం 11.35కి చర్లపల్లి చేరుకుంటుందని తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

రేపల్లె, మే 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇసుకపల్లి 17వ వార్డుకు చెందిన మోపిదేవి సుమతి(41) బుధవారం నిమ్మ చెట్టుకు నీరుపోస్తూ విద్యుదాఘాతానికి గురైంది. పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి కరెంటు రావడంతో షాక్ కొట్టి ఆమె మృతి చెందింది. పట్టణ సీఐ మల్లికార్జున్‌రావు వివరాల మేరకు.. సుమతి ఇంటి వద్ద చెట్టుకు నీరు పోస్తూ.. కరంటు పోల్‌కు ఆనుకోవడంతో ప్రమాదం జరిగింది. ఆమెను కాపాడటానికి ప్రయత్నించిన కొడాలి పద్మ అనే మహిళ కూడా విద్యుత్‌షాక్‌తో స్వల్పంగా గాయపడింది. ఇది గమనించిన మృతురాలి భర్త శివనాగేశ్వరరావు ప్రభుత్వ వైద్యశాలకు సుమతిని తీసుకెళ్లగా.. ఆమె చనిపోయిందని వైద్యులు నిర్ధారించారు. సుమతి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రైస్ కార్డుల పండుగ!



- ఏళ్ల తరబడి నిరీక్షణకు తెర.. లబ్ధిదారుల్లో సంతోషం
- కొత్తకార్డులు సహా.. 6 రకాల మార్పుచేర్పులకు అవకాశం
- హౌస్‌హోల్డ్ మ్యాపింగే కీలకమంటున్న అధికారులు
- వచ్చే నెల 6వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం

గుంటూరు మే 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైస్ కార్డుల పండగ మొదలైంది. ఎప్పుడెప్పుడా అని ఏళ్ల తర బడి రైస్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న వేలాది మంది లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం, పౌర సరఫరాల శాఖ మంగళవారం తీపి కబురు చెప్పడంతో బుధవారం నుంచి కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభమైంది.

● మొత్తం ఆరు రకాల సదుపాయాలు

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రైస్‌కార్డుల్లో.. మొత్తం ఆరు రకాల సేవలను అందుబాటులోకి తెచ్చింది. కొత్తగా పెళ్లి చేసుకున్నవారికి నూతన కార్డులు, అడ్రస్ మార్పు, కార్డుల విభజన, కొత్త సభ్యుల చేరిక, చిరునామా మార్పు, మరణించిన వారి పేర్ల తొలగింపు, ఇటీవల పుట్టిన చిన్నారుల పేర్ల నమోదుతోపాటు.. రైస్ కార్డు సరెండర్ వంటి సదుపాయాలకు అవకాశం కల్పించింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో దర ఖాస్తు ప్రక్రియ ఉంటుంది. ఈ నెల 7 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకూ నెలరోజుల పాటు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

● అర్హతలు ఇలా..

కొత్తగా వివాహం చేసుకున్న జంట, ప్రస్తుతం రేషన్‌కార్డులో లేని కుటుంబాలు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారు, విడిపోయినవారు, తగిన అడ్రస్ ప్రూఫ్ ఉంటే వలసవచ్చిన వారు, నిరాశ్రయులు.. రైస్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చు. విధిగా హౌస్‌హోల్డ్ మ్యా పింగ్‌లో నమోదై ఉండాలి. అలా లేకుంటే కార్డు పొం దేందుకు అనర్హులవుతారు. ఒకవేళ నమోదైనా దర ఖాస్తుదారు ఒకే కుటుంబ సభ్యుడిగా హౌస్ హోల్డ్ లో నమోదైనా వారు అనర్హులవుతారు. ఇన్‌కమ్ టా క్స్ రిటర్న్ చెల్లింపు దారులు, ప్రభుత్వ ఉద్యోగులు రైస్ కార్డులు పొందడానికి అనర్హులు.

● కావాల్సిన పత్రాలు

రైస్ కార్డుకు దరఖాస్తు చేసుకునేవారు ఆధార్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రం కోసం.. విద్యుత్ బిల్లు, ఓటరు గుర్తింపు కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌పోర్టు సైజు ఫొటోతో అనుబంధ సచివాలయానికి వెళ్తే.. అక్కడ డిజిటల్ అసిస్టెంట్ దరఖాస్తు ప్రక్రియను పూర్తిచేస్తారు.

● స్వయంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు

పౌర సరఫరాల శాఖ వెబ్‌సైట్‌లోకి వెళ్లి అక్కడ కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కార్డు కావాల్సిన 'కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోండి'పై క్లిక్ చేయాలి. కుటుంబ, వ్యక్తిగత వివరాలు నమోదు చేయాలి. కావాల్సిన పత్రాలు అప్లోడ్ చేయాలి. దరఖాస్తు ప్రక్రియ పూర్తయిన తరువాత రసీదు నంబరు వస్తుంది. దాని ద్వారా అప్లికేషన్‌ను ట్రాక్ చేసుకోవచ్చు. ఏపీ రేషన్ కార్డు పోర్టల్‌లో అప్లికేషన్ ను ట్రాక్ చేయవచ్చు. లేదంటే 1967/1800-425- 8585 నంబర్ల ద్వారా సమాచారం పొందవచ్చు. దీంతోపాటు వాట్సాప్ గవర్నె న్స్ లింక్ ద్వారా కూడా రేషన్ కార్డుకోసం దరఖాస్తు చేసుకోవచ్చు. మే 12 నుంచి ఇది అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు.

రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు 50 శాతం పూర్తి

◆ రేపల్లె స్టేషన్ పనులు పరిశీలించిన డీఆర్‌ఎం సుధేష్ణసేన్ ◆ 22 భోగీలతో రేపల్లె టు తిరుమల రైలు

రేపల్లె, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం ఉమ్మడి గుంటూరు జిల్లాలో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఐదు రైల్వేస్టేషన్లను కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని రైల్వే డివిజనల్ మేనేజర్ సుధేష్ణ సేన్ తెలిపారు. పథకంలో భాగంగా రేపల్లె రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె బుధవారం పరిశీలించారు. నూతన భవనాలు, పెంచిన ప్లాట్‌ఫాంలు, టిక్కెట్ బుకింగ్ కౌంటర్ భవనాలు, సిగ్నలింగ్ వ్యవస్థను పరిశీలించారు. అనంతరం అభివృద్ధి పనుల మ్యాప్‌ను పరిశీలించి, పురోగతిని తెలుసుకున్నారు. అభివృద్ధి పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అమృత్ భారత్ పథకంలో భాగంగా రేపల్లె, పిడుగురాళ్ల, తెనాలి, బాపట్ల, గుంటూరు స్టేషన్‌లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే సుమారు 50 శాతం పైనే పనులు పూర్తయ్యాయని డీఆర్‌ఎం వెల్లడించారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రేపల్లె నుండి వయా కడప మీదగా తిరుపతి వెళ్లే రైలు భోగీలు పెంచే ఆలోచన ఉందని తెలిపారు. దానికి అనుగుణంగా 22 భోగీలకు ప్లాట్‌ఫాం పెంచి కట్టాలని అధికారులకు సూచించారు. దానికి అన్ని అనుమతులు ఇస్తామని తెలిపారు. అభివృద్ధి పనులు పూర్తయ్యితే కొత్త ట్రైన్లు వచ్చే విధంగా చూస్తామన్నారు. తెనాలి-రేపల్లె మార్గంలో రెండు లేన్‌లు వేస్తే బాగుంటుందని స్థానిక నాయకులు, ప్రజాసంఘాలు డీఆర్‌ఎం దృష్టికి తీసుకెళ్లారు. వాటిపై అధ్యాయనం చేసి చర్యలు తీసుకుంటామని ఆమె సమాధానం ఇచ్చారు. స్టేషన్‌లో వసతుల కొరతపై పట్టణాభివృద్ధి సంఘం కార్యదర్శి సీవీ మోహన్‌రావు, రైళ్ల సర్వీసులను పెంచాలని పట్టణ ఆదర్శ వేదిక కార్యదర్శి యడ్లపల్లి కిషోర్‌బాబు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవోఎం శ్రీనాథ్, డీఈఎన్ శేషు, డీఈడబ్ల్యూ సుదర్శన్ నాయక్, గోపీచంద్ పాల్గొన్నారు.



వేమూరు రైల్వేస్టేషన్‌లో రెండో ప్లాట్ ఫాంపై స్థలాన్ని పరిశీలిస్తున్న రైల్వే డీఆర్‌ఎం సుదేష్ణసేన్

గూడ్స్ షెడ్ నిర్మాణానికి స్థల సేకరణ అవసరం:డీఆర్‌ఎం

వేమూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): వేమూరు నియోజకవర్గ పరిధిలోని రైతులు, వ్యాపారుల సౌకర్యార్థం రూ.9.98 కోట్లతో గూడ్స్ షెడ్డు నిర్మాణానికి స్థల సేకరణ అవసరమని, అందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని రైల్వే డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె ప్రత్యేక రైలు భోగీల్లో వేమూరు స్టేషన్‌కు చేరుకున్నారు. స్టేషన్ పరిసరాలను, సౌకర్యాలను పరిశీలించారు. 2వ ప్లాట్ ఫాం వైపు ఏర్పాటు చేయనున్న గూడ్స్ షెడ్డు నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ప్లానింగ్ మ్యాప్‌తో ఇంజినీరింగ్ అధికారులు ఆమెకు వివరాలు తెలిపారు. ప్లాట్‌ఫాంపై తాగునీటి సౌకర్యం, బల్లలను తక్షణమే ఏర్పాటు చేయాలని డీఆర్‌ఎం అధికారులను ఆదేశించారు.

ఏపీ సీపీడీసీఎల్ టెక్నికల్ డైరక్టర్‌గా మురళీకృష్ణయాదవ్ బాధ్యతల స్వీకారం



గుంటూరు, మే 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ టెక్నికల్ డైరక్టర్‌గా ఆవుల మురళీకృష్ణయాదవ్ నియమి తులయ్యారు. ఈ మేరకు బుధవారం విజయవాడలోని కార్పొరేట్ కార్యాలయం లోని చాంబర్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ కార్పొరేట్ కార్యాలయంలో సీజీఎంగా మురళీకృష్ణ ఉద్యోగ విరమణ చేశారు. ఆయన సేవలను, సమర్థతను గుర్తించిన ప్రభుత్వం తాజాగా సీపీడీసీఎల్ టెక్నికల్ డైరక్టర్‌గా నియమించింది. గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు, పలువురు అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

జీజీహెచ్‌ను అత్యుత్తమంగా తీర్చిదిద్దుతాం

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు మెడికల్, మే 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రిలో రోగులకు చక్కటి వైద్య సేవలు అందిస్తూనే.. రాష్ట్రంలోనే అత్యుత్తమ వైద్య బోధనాసుపత్రిగా తీర్చిదిద్దుతామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.



వైద్య పరికరాలను ప్రారంభిస్తున్న మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే నసీర్

బుధవారం ఆసుపత్రి శుశృత హాల్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద రూ.65 లక్షలతో అందజేసిన నేత్ర వైద్య పరికరాలను ఆయన ప్రారంభించారు. అలాగే గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం (జింకానా) చైర్మన్ ఆఫ్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీ డాక్టర్ రవికుమార్ త్రిపురనేని విరాళంగా అందజేసిన రూ.20 లక్షల విలువైన గ్యాస్ట్రో ఎంటరాలజీ, మత్తు మందు వైద్య పరికరాలను మంత్రి పెమ్మసాని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రీజినల్ హెడ్ పవన్‌కుమార్‌ను, డాక్టర్ రవికుమార్ త్రిపురనేనిని మంత్రి పెమ్మసాని, కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు సన్మానించారు. ఇకపై ఏటా రూ.5 కోట్లను గుంటూరు జీజీహెచ్‌కు కేటాయించేలా కృషి చేయాలని పవన్‌కుమార్‌కు మంత్రి పెమ్మసాని సూచించారు. సూపరింటెండెంట్ డాక్టర్ రమణ మాట్లాడుతూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అందజేసిన ఆప్టికల్స్ కోహెరెన్స్ టోమోగ్రఫీ, విజువల్ ఫీల్డ్ ఎనలైజర్, నాన్ కాంటాక్ట్ టోనోమీటర్ వంటి వైద్య పరికరాలతో నీటి కాసులు జబ్బుకు మెరుగైన వైద్య అందించే వెసులుబాటు కలుతుందన్నారు. డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్ పోతురాజు సమత, ప్రొఫెసర్ రవిబాబు, ఉండవల్లి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు జాతి పూర్వ వైభవానికి ప్రభుత్వ సహకారం

● రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



విజేతకు ద్విచక్రవాహనాన్ని అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ తదితరులు

పొన్నూరుటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): ఒంగోలు జాతి ఎడ్ల పూర్వ వైభవానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సాయం చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. వడ్లమూడి గ్రామంలో ధూళిపాళ్ల వీరయ్య చౌదరి మెమోరియల్ జాతీయ స్థాయి వృషభరాజాల బలప్రదర్శన పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ఒంగోలు జాతి ఖ్యాతి ఖండాంతరాలు దాటిందని పేర్కొన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి చేసిన కృషి ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. సంగం డెయిరీ అభివృద్ధి ద్వారా వేల కుటుంబాలు ఆర్థికంగా బలపడ్డాయన్నారు. వీరయ్య చౌదరి వారసుడిగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఒంగోలు జాతి ఎడ్ల ప్రదర్శన నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ రైతు బాంధవుడు ధూళిపాళ్ల వీరయ్య చౌదరి అని కొనియాడారు. జూనియర్స్ విభాగంలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ఎడ్లు పోటీ పడ్డాయి.

ఒంగోలు జాతి ఎడ్ల మనుగడను కాపాడుకుందాం

ఒంగోలు జాతి ఎడ్ల మనుగడను కాపాడుకుందామని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల నుండి 150 జతల ఎడ్లు పాల్గొనేందుకు వచ్చాయని తెలిపారు. బాలకోటేశ్వరస్వామి ఆశీస్సులు.. ఎన్టీరామారావు, వీరయ్య చౌదరి స్ఫూర్తితో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ గౌరవానికి, ఆత్మప్రతీకకు నిలిచే ఒంగోలు జాతి ఎడ్లు అంతరించిపోయే దశలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ అర్బన్ డెవలంప్‌మెంట్ కార్పొరేషన్ డైరక్టర్ వడ్రాణం మార్కండేయబాబు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా పోటీలు కొనసాగించి, ఎడ్ల పోషకులను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమంలో భాగం డిస్పెన్సరీలు

● ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

నరసరావుపేట టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాల్లో డిస్పెన్సరీల నిర్మాణం ఒకటని ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ పేర్కొన్నారు. బుధవారం నరసరావుపేటలో ఏపీఎస్ ఆర్టీసీ డిస్పెన్సరీ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కొనకళ్ల మాట్లాడుతూ ఇటీవలే మచిలీప ట్నంలో డిస్పెన్సరీని ప్రారంభించినట్లు తెలిపారు. మొదటి నుంచి ఆర్టీసీతో అవినావభావ సంబంధం ఉందని, తాను ట్రేడ్ యూనియన్ నాయకుడిగా పనిచేశానని గుర్తుచేసుకున్నారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం తర్వాత కొన్ని జబ్బులకు మాత్రమే వైద్య సదుపాయం ఉందని పేర్కొన్నారు. ఆర్టీసీకి ఏ విధంగానైనా.. సేవలు అందించడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ రూ.84 లక్షల వ్యయంతో డిస్పెన్సరీ నిర్మించినట్లు తెలిపారు. ట్రై కాగ్ మిషన్ ద్వారా 1,200 మందిని రక్షించినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు మా ట్లాడుతూ డిస్పెన్సరీలో పీ4 ద్వారా ఏసీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. జోన్-3 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.నాగేంద్ర ప్రసాద్, జోనల్ చైర్మన్ ఎస్.సురేష్‌రెడ్డి, జిల్లా రవాణా అధికారి ఎం.మధు, డీఎం శ్రీనివాసరావు, ఇతర ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎండీ ద్వారకా తిరుమలరావు, ఎమ్మెల్యే అరవిందబాబు తదితరులు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	147, 156, 167
చికెన్ విత్ స్కిన్(కిలో)	284.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	294.00

పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి

చిలకలూరిపేట, మే7 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని కుక్కపల్లివారిపాలెం గ్రామ పరిధిలో జరిగింది. ఈ ఘటనలో 8 గొర్రెలు కూడా మృతి చెందాయి. మృతుడు పెదనందిపాడు మండలం జరుగులవారి పాలేనికి చెందిన ఒంటిపులి అంకమ్మ (70)గా గుర్తించారు. సాయంత్రం ఒక్కసారిగా వర్షంతో పాటు పిడుగులు కూడా పడ్డాయి. రాత్రి అయినా గొర్రెల కాపరి అంకమ్మ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుక్కుంటూ వెళ్లగా.. ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే మృతుడి కుటుంబ సభ్యులు వీఆర్‌ఓ కు సమాచారం అందించారు.

టింబర్ డిపోకు రూ. 3 లక్షల పెనాల్టీ

గుంటూరు సిటీ, మే 7(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలోని టింబర్ డిపోలపై విజి లెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. నరసరావుపేట మండలం కేశానుపల్లి గ్రామంలోని శ్రీ విజయ టింబర్ డిపో అండ్ సామిల్‌లో అనుమతులు లేకుండా భారీ మొత్తంలో నిల్వ ఉంచిన దరిసనం, గుమ్మడి టేకు దుంగలను గుర్తించారు. ఎటువంటి బిల్లులు లేకపోవడంతో... యజమాని మురళీధర్‌రెడ్డికి రూ. 3 లక్షల పెనాల్టీ విధించారు. ఇన్‌స్పెక్టర్ పల్లపు శివాజీ, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సైదులు, నర్సరా వుపేట డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నీలిమ దేవి పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో కూలీ మృతి

గుంటూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధి అశోక్‌నగర్ 3వ లైన్‌లో బుధవారం విద్యుదాఘాతంతో రోజువారి కూలీ ఏటూరి తిరుపతిరావు (27) మృతి చెందాడు. ఓ ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నాడు. డ్రమ్ములలోని నీటిని మోటర్ ద్వారా తోడుతుండగా కరెంట్ షాక్‌కి గురయ్యాడు. వెంటనే తిరుపతిరావును జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని సోదరుడు వీరాంజనేయులు ఫిర్యాదు మేరకు.. పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

98,525 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 93,868 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 98,525 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 32,808 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తేజ	10000	14000
334	9500	13300	షార్క్-1	10000	12000
నంబరు.5	10000	12500	బ్యాడిగి 355	10000	13000
273	10000	12500	సింజెంటా బ్యాడిగి 5531		
341	10000	13200		---	---
4884	10000	11200	దేవనూరుడీలక్స్	10000	12500
సూపర్10	10000	12500	ఆర్మూరు	9800	11200
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			తాలుకాయలు	4500	6500

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ఈదుర గాలుల బీభత్సం

పొన్నూరుటౌన్, మే 7: పొన్నూరు పట్టణంలో బుధవారం ఈదురు గాలులు బీభత్సాన్ని సృష్టించాయి. నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈదురు గాలులు ధాటికి చెట్టు కొమ్మలు విరిగిపడి సమీపంలో ఉన్న దివ్యాంగుల ఉపకరణాల ఎంపిక శిబిరం టెంట్ పై పడ్డాయి. కొద్ది సేపటి క్రితమే వర్షం ప్రారంభం కావడంతో శిబిరంలో ఉన్న వారు సమీపంలోని భవనాలకు తరలి వెళ్లడంతో పెను ప్రమాదం తప్పింది.


విడాకులు కావాలి.. నాటికలోని సన్నివేశం

వివాహ వ్యవస్థ గొప్పతనాన్ని చాటిన నాటికలు

పొన్నూరు టౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): పొన్నూరు కళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 24వ ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ బుర్రకథ కళాకారులు, పద్మశ్రీ షేక్ నాజర్ శతజయంతి సందర్భంగా ఈ పోటీలను నిర్వహించారు. నిడుబ్రోలు జిల్లా పరిషత్ ప్రాంగణంలోని డా. నన్నపనేని జ్ఞానేంద్రనాథ్ కళావేదిక ప్రాంగణంలో పోటీలు నిర్వహించారు. చేబ్రోలు తానిక నిజాంపట్నం తన్మయిశ్రీ శాస్త్రీయ నృత్యంతో పోటీలు ప్రారంభమయ్యాయి. తొలిగా గంగోత్రి సాయి దర్శకత్వంలో అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి విడాకులు కావాలి నాటికను ప్రదర్శించారు. దాంపత్య జీవితంలో కలుగుతున్న బేధాలు, అపోహలు, చిన్నచిన్న సమస్యల కారణంగా పంతాలకు పోయి విడాకులు కోరుతున్న ఇతివృత్తంతో నాటిక ప్రదర్శన సాగింది. రెండొవ నాటికగా చెరుకూరి సాంబశివరావు రచన, దర్శకత్వంలో కర్రపాడు ఉషోదయ కళానికేతన్ ఆధ్వర్యంలో కిడ్నాప్ నాటికను ప్రదర్శించారు. స్వార్థబుద్ధితో తల్లిదండ్రులను దూరంగా ఉంచుతూ మనుగడ సాగిస్తున్న యువతకు కుటుంబ వ్యవస్థ గొప్పతనాన్ని తెలియచెప్పే సందేశంతో ఈ కిడ్నాప్ నాటిక ప్రదర్శించారు.

హనుమత్ వాహనంపై భావనారాయణుడు


కోదండ రాముడిగా సాక్షి భావనారాయణ స్వామి

పొన్నూరుటౌన్, మే 7: పొన్నూరు పట్టణంలో వేంచేసియున్న శ్రీ సుందరివల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావనారాయణ స్వామి బ్రహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం స్వామి కోదండ రాముడి అలంకారంలో పూజలందుకున్నారు. ఉదయం ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను హనుమత్ లక్ష్మణ సీతా సమేత కోదండరాముడిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కనులపండుగలా గ్రామోత్సవం నిర్వహించారు.

మన్యం వీరుడు అల్లూరి

● ఎంపీపీ భీమవరపు పద్మావతి


అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, అధికారులు

కొల్లిపర, మే 7(ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఒక విప్లవ జ్యోతి అని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సీతారామరాజు చిత్రపటానికి ఎంపీపీ పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మి సిబ్బందితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరిపాలనాధికారి ప్రతాప్‌రెడ్డి, ఈవోపీఆర్డీ భార్గవ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస మూర్తి, ఏపీవో వెంకయ్య పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి బుధవారం రూరల్ మండలం కొవెవరంలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కడిమెళ్ల నర్సరాజు, కార్తీక్‌రాజు, గోపి, ప్రభాస్, మాలకొండరాజు పాల్గొన్నారు.

మాక్ డ్రిల్‌తో ఆత్మరక్షణ..

తెనాలిరూరల్,మే7(ఆంధ్రజ్యోతి): మాక్ డ్రిల్ సంక్షోభ సమయంలో ఆత్మరక్షణకు ఉపయోపడుతుందని తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా అన్నారు. బుధవారం స్థానిక చినరావూరులో ఐటీఐ విద్యార్థులకు మాక్ డ్రిల్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అత్యవసర పరిస్థితులో ఎలా స్పందించాలో వివరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ, మునిసిపల్ కమిషనర్ బండిశేషన్న, తహసీల్దార్ గోపాలకృష్ణ, పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ హనీఫ్, పోలీస్, ఫైర్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆసియా పవర్ లిఫ్టింగ్ పోటీలలో నాలుగు పతకాలు



పతకాలతో షానూన్

తెనాలి అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): ఆసియా సబ్ జూనియర్, జూనియర్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో తెనాలికి చెందిన పవర్ లిఫ్టర్ మదిర షానూన్ నాలుగు పతకాలు సాధించింది. స్థానిక క్విక్ జిమ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థిని కేఎల్ యూనివర్సిటీలో చదువుతోంది. ఉత్తరాఖండ్ డెహ్రాడూన్‌లో ఈ నెల 5న పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలలో స్క్వాడ్ విభాగం 100 కిలోల కాంస్యం, బెంచ్ ప్రెస్ 42.5 కిలోల విభాగంలో కాంస్యం, డెడ్ లిఫ్ట్ 110 కిలోల విభాగంలో రజతం, ఓవరాల్ ప్రదర్శన 252.5లో కాంస్య పతకం సాధించింది. జిమ్ కోచ్‌లు ఘట్టమనేని సాయిరేవతి, పూసపాటి శివరామకిరణ్‌రాజు, షానూన్‌ను అభినందించారు.

ఐతానగర్ ఉపాధ్యాయుల ప్రచారం

తెనాలి అర్బన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు అత్యుత్తమ విద్య ప్రభుత్వ పాఠశాలల్లో అందుతుందని ఐతానగర్ హైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ గాలి కిరణ్ చెప్పారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి బుధవారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. హెచ్ఎం రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు బెల్లంకొండ వెంకట్, రాజకిషోర్, బసవేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పినపాడు పార్క్ పనులు వేగవంతం చేయండి

● మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి రూరల్,మే7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పినపాడు ఐలాండ్ పార్క్ అభివృద్ధికి చేపట్టిన పనులను వేగవంతం చేయాలని మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. బుధవారం పట్టణంలోని పినపాడు ఐలాండ్ పార్క్‌ను మునిసిపల్ కమిషనర్ బండిశేషన్న, కౌన్సిలర్ రామయ్య, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. పార్క్‌లో చేపట్టిన పనుల వివరాలు ఇంకా మిగిలి ఉన్న పనులపై అధికారుల నుండి వివరాలు సేకరించారు. మునిసిల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ తెనాలిగా తీర్చిదిద్దుకుందాం

పచ్చదనానికి, పరిశుభ్రతకు నిలయంగా పట్టణాన్ని స్వచ్ఛ తెనాలిగా తీర్చిదిద్దుకుందామని అందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 24, 24వ వార్డులలో కమిషనర్ బండి శేషన్నతో కలిసి ఆమె పర్యటించారు. వార్డులో ఉన్న సమస్యలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో శానిటేషన్, కాలువల్లో మాంస వ్యర్థాలు వంటి వాటిపై వార్డు కౌన్సిలర్ లావణ్య చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన చైర్‌పర్సన్ తక్షణమే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.


వివరాలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ రాధిక

ఆపరేషన్ సిందూర్‌పై హర్షం


గాంధీచౌక్‌లో వేడుకలు జరుపుతున్న బీజేపీ నాయకులు

తెనాలి అర్బన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదాన్ని పోషిస్తున్న పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పాలని బీజేపీ నాయకులు అడపా సంపత్‌రాయుడు పేర్కొన్నారు. పహల్గాం దాడికి నిరసనగా ఉగ్రవాద స్థావరాలను భారతసైన్యం మట్టుపెట్టడం పట్ల గాంధీచౌక్‌లో బుధవారం ప్రదర్శన నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ పేరిట ఉగ్రవాద శిబిరాలను తుడిచిపెట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. మరోసారి భారత్ జోలికి రాకుండా పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్పాలని కోరారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తెనాలి హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో..

● తెనాలిరూరల్, మే7(ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ ఉగ్రవాదుల స్థావరాలను ఆపరేషన్ సిందూర్ చేపట్టి ధ్వంసం చేయడం పట్ల తెనాలి హిందూ చైతన్య వేదిక సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని గాంధీ చౌక్‌లో పాకిస్తాన్ చేసిన ఉగ్రదాడిని, ఆదేశ ప్రధాని భారత్‌ను కించపరుచ్తూ చేస్తున్న వ్యాఖ్యలను ఖండిస్తూ పాక్ జెండారు నడిరోడ్డుపై ఉంచి చెప్పులతో తొక్కి నిరసన తెలిపారు. అంబటి మారుతీరామ్, కఠారి వాసుదేవనాయుడు, పొట్టి మూర్తి లక్ష్మీశ్రీనివాస్, తాడేపల్లి ముని, కొల్లూరు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన


అన్నదానం ప్రారంభిస్తున్న ఆలపాటి

తెనాలి అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 332వ ఆరాధనోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఉత్సవాలలో పాల్గొని అన్నదానాన్ని ప్రారంభించారు. గాంధీచౌక్‌లోని ఆలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఈవో హరిప్రసాద్, సంఘ నాయకులు గుంటముక్కల వెంకట నాగార్జున, కడియం శేషుబాబు, లక్ష్మీప్రసాద్, కమిటీసభ్యులు పాల్గొన్నారు. రూరల్ మండలం కొవెవరంలో బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు నిర్వహించారు. రాజులపాలెంలో ప్రభ ఊరేగించారు. సాంబశివరాజు, వెంకటేశ్వరరాజు, వెంకటరాజు, శ్రీనివాసరాజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు. అంగలకుదురులో ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. జెండా చెట్టు దగ్గర విశేష పూజలు చేసి.. జెండా ఊరేగించారు. గొల్లపూడి సాయిగిరి, నాగజ్యోతి, ఏలూరి సాంబశివరావు, నాగలక్ష్మి దంపతులు పూజలు నిర్వహించారు.

పొన్నూరు నియోజకవర్గంలో..

పొన్నూరుటౌన్, మే 7: పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. నిడుబ్రోలులో 11వ వార్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు. రైల్వేస్టేషన్ సమీపంలోని ఆలూరి రోడ్డులో ఉన్న ఆలయంలో 26వ ఆరాధన మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు.

శ్రీవాసవీమాత జన్మదిన వేడుకలు


పొన్నూరు: ప్రత్యేక అలంకరణలో కన్యకపరమేశ్వరి

తెనాలి అర్బన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి జన్మదినోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున వైశ్య పతాకాన్ని ఆవిష్కరించి, గణపతి పూజ, విశేష అభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు, మూలమంత్ర హోమాలు, లలిత సహస్రనామ పారాయణ, ఉంజల్ సేవా కార్యక్రమాలు వేడుకగా జరిపించారు. అలంకరించిన రథంపై అమ్మవారి ఉత్సవ మూర్తులను ఉంచి పట్టణంలో మేళ తాళాలతో ఊరేగించారు. ఆలయ కమిటీ ఇన్‌చార్జి చైర్మన్ మునగాల మోహన్‌శ్యాంప్రసాద్, పెండేల వెంకట్రావు, తాతా శ్రీనివాసరావు, మద్ది మల్లిఖార్జునరావు, ఉప్పల వరదరాజులు, దేసు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరులో..

పొన్నూరుటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం అమ్మవారి జయంతి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వైశాఖ శుద్ధ దశమిని పురస్కరించుకుని పూజలు జరిగాయి. పంచామృత అభిషేకాలు జరిపారు. ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి లక్ష మల్లెలతో పూజలు జరిపారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కారుమూరి ప్రకాశ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.


రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న శ్యాంప్రసాద్

మాజీ మంత్రి ధర్మారావుకు ఘన నివాళి


ధర్మారావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

తెనాలి అర్బన్, మే 7 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి దివంగత ఆలపాటి ధర్మారావు వర్ధంతి బుధవారం ప్రకాశం రోడ్డులో నిర్వహించారు. కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ కౌన్సిలర్ ఆలపాటి మాధవరావు మాట్లాడుతూ ఎన్నో మంత్రి పదవులను నిర్వహించడంతో పాటు స్పీకర్‌గా కూడా పని చేసిన ధర్మారావు రాజకీయాల్లో అవినీతికి పాల్పడకుండా ఆదర్శంగా నిలిచారని, మంచి పరిపాలన అందించారని చెప్పారు. జెట్టి అంకినీడు, డాక్టర్ ఏవీ ప్రసాద్, కాళిదాసు సత్యనారాయణ, దశరథ రామిరెడ్డి, సాంబశివరావు, ఆదిత్య, సురేష్ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

అగ్ని ప్రమాదాలపై అవగాహన

పెదకాకాని, మే 7(ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలాజికల్ విశ్వవిద్యాలయంలో 10ఏ బాలికల బెటాలియన్ వార్షిక శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. మంగళగిరి అగ్నిమాపక అధికారి వై. వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఎన్.సి.సి క్యాడెట్లకు అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. అడ్మినిస్ట్రేటివ్ అధికారి మేజర్ అవినాష్ సట్వాల్, వీవీఐటీయూ ఎస్.సి.సి ఆఫీసర్ ఎల్ ఎ.శ్రీవాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఈకేవైసీని వేగవంతం చేయండి

తెనాలిరూరల్, మే7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ కార్డు దారుల ఈకేవైసీ ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ కె.వి గోపాలకృష్ణ సూచించారు. బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో మండలంలోని వీఆర్వోలు ఇతర అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి, మార్గనిర్దేశనం చేశారు.

వైద్య శిబిరాలతో దీర్ఘకాలిక రోగాల గుర్తింపు

కొల్లిపర, మే 7(ఆంధ్రజ్యోతి): మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం వలన దీర్ఘకాలిక రోగాలను గుర్తించవచ్చునని మండల వైద్యాధికారి సుమంత్ అన్నారు. బుధవారం వల్లభాపురంలో వైద్యాధికారులు ఫామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ సరళ, ఏఎన్ఎం యామిని, హెల్త్ అసిస్టెంట్ మల్లేశ్వరరావు, డీఈవో బొమ్మ కోటిరెడ్డి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలి

తెనాలిరూరల్, మే7(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, సీపీఎం అగ్రనేత ఎ.కె గోపాలన్ స్మారకార్థం నిర్మించిన సీపీఎం జెండాపోల్‌ను విరిచిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ రూరల్ కార్యదర్శి ములకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. గుడివాడలో అంబేడ్కర్ సెంటర్‌లోని సీపీఎం జెండాను విరిచిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరుతూ నిరసన తెలిపారు. జ్యోతుల కోటేశ్వరరావు, బండి సుధాకరరావు, బుదరగుంట భాస్కరరావు, బండికళ్ల పసి పాల్గొన్నారు.

మే 20న సార్వత్రిక సమ్మె

తెనాలి అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెలో అన్ని కార్మిక సంఘాలు పాల్గొంటాయని సీపీఎం కార్యదర్శి కె.బాబుప్రసాద్ చెప్పారు. ఏపీ బ్రేవరేజ్ కార్పొరేషన్ మేనేజర్‌కు కార్మికులతో కలిసి బుధవారం సమ్మె నోటీసు అందజేశారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఉండాలని డిమాండ్లతో సమ్మె జరుగుతుందన్నారు. షేక్ హుస్సేన్‌వలి, గోపాలరావు, వెంకట్రావు, సంగమేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

తెనాలి రూరల్, మే7(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పట్టణంలోని మారీసుపేటకు చెందిన శివనాగప్రసాద్ ఫాస్ట్‌ఫుడ్ వ్యాపారంలో నష్టాలు రావడంతో తాపీ పనికి వెళుతున్నాడు. గత నెలాఖరులో గుంటూరు పనికని వెళ్లి తిరిగిరాలేదు. అతడి ఫోన్ స్విచ్ఛాప్ రావడంతో బుధవారం తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'సీనయ్య బండి' పోస్టర్ ఆవిష్కరణ

పొన్నూరుటౌన్, మే 7: పట్టణంలో తోటమ్మ గుడి ఆలయం వద్ద ప్రసిద్ధి చెందిన సీనయ్య బండిపై నిర్మించే లఘు చిత్రానికి సంబంధించిన ప్రచార పోస్టర్‌లను బుధవారం ఆవిష్కరించారు. నిసార ఎంటర్‌టైన్‌మెంట్ నిర్వహణలో పట్టణానికి చెందిన నోవెల్ నిస్సార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఎండీ జమా దర్శకత్వం వహిస్తున్నారు. పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీ రామాయణ యజ్ఞం

తెనాలి రూరల్,మే7(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర వాల్మీకి వాసుదాస దాసశేషస్వామి అంగలకుదురులో పదిరోజులుగా నిర్వహిస్తున్న శ్రీ రామాయణ యజ్ఞ పూజలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు స్వామి వారికి లక్షమల్లెలతో అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆశ్రమపీఠాధిపతి సీతారామదాసు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమాల్లో అర్చకస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

సచివాలయం సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

● ఎంపీడీవో విజయలక్ష్మి


సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, మే 7(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది బాధ్యతగా పని చేయాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. బుధవారం కొల్లిపర సచివాలయాలను ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. సర్పంచ్ పిల్లి రాధిక, ఈవోపీఆర్డీ భార్గవ్, కార్యదర్శి అలకానంద పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఈ నెల 10వతేది లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులకు 21వ నుంచి 50 సంవత్సరాలలోపు ఉండి, తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలన్నారు.


గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమావేశం

తెనాలి అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): నేలపాడు పరిధిలోని కె.చంద్రకళ, బి.వెంకటేశ్వర్లు హిందీ పండిత ప్రశిక్షణ కళాశాలలో 2002-03 సంవత్సరం పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ సయ్యద్ షౌకత్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, తమ బ్యాచ్‌లో శిక్షణ పొందిన 60 మందిలో 45 మంది హిందీ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించడం విశేషమన్నారు. నాటి గురువులు వరలక్ష్మి, మంజుల, అడ్వయిజర్ ప్రభాకర్, ఫౌండర్ షౌకత్‌లను సన్మానించారు.

పేరంటాలమ్మ ఉత్సవాలు ప్రారంభం

తెనాలి అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): ఐతానగర్‌లోని శ్రీవెంకయ్య, గౌరమ్మ పేరంటాలమ్మ తిరునాళ్ల బుధవారం ప్రారంభమయ్యాయి. ఐదు రోజులు జరిగే తిరునాళ్లను దీపారాధనతో ప్రారంభించారు. 8న ప్రతిమల ఊరేగింపు, 9న గుమ్మడిసిడి 10న జల బిందెలు, పూలకత్తెర 11న పొంగళ్లు, గుడిదీపాలు, పసుపు పండ్లు, కరెంట్ ప్రభలు కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు కోరారు.

పశ్చిమ డెల్టాకు 216 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, మే 7 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెలాక్టు ప్రకాశం బ్యారేజి నుంచి 216 క్యూసెక్కుల నీటిని బుధవారం విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.8 అడుగుల నీటిమట్టం ఉండగా రేపల్లె కాల్వకు 90, తూర్పు కాల్వకు 45, నిజాంపట్నం కాల్వకు 44, కొమ్మ మూరుకాల్వకు 342 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, మే 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో 952 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,000, గరిష్ఠధర రూ.11,119, మోడల్ ధర రూ.10,611 పలికాయి. కాయ కనిష్ఠధర రూ.10,000, గరిష్ఠధర రూ.11,119, మోడల్‌ధర రూ.10,611 పలికాయి.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెదనందిపాడు, మే, 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కత్రపాడు, నాగులపాడు, పెదనందిపాడు గ్రామాలకు గురువారం ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు వస్తారని ఎంపీడీవో లక్ష్మీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కత్రపాడు, నాగులపాడులో ఎంజీఎన్‌ఆర్‌జీఎస్ పథకం కింద తాగునీటి చెరువులలో పూడికతీత పనులు చేపడతారని, పెదనందిపాడు-2 సచివాలయంలో కుట్టు శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొనాలని ఆమె చెప్పారు.

అల్లూరి సీతారామరాజుకి నివాళి



అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సంఘ నాయకులు

పెదనందిపాడు, మే, 7 (ఆంధ్రజ్యోతి) : మండలపరిధిలోని గోరిజవోలుగుంటపాలెంలో స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమం క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి, ప్రాణం సైతం అర్పించిన యోధుడని అన్నారు. తన చిన్ననాటి నుండే నిరక్షరాస్యులను, పేదలను, వెంట వేసుకొని పరిమిత వనరులతోనే బ్రిటీష సామ్రాజ్యాన్ని గడగడలాడించారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పాతలపల్లి శ్రీనివాసరాజు, నాగరాజు బ్రహ్మంరాజు, కంపరాజు వెంకటేశ్వరరాజు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

● తహసీల్దారు బి.వెంకటస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు

పెదనందిపాడు, మే 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి వచ్చే అర్జీలను పరిశీలించి త్వరగా పరిష్కరించాలని తహసీల్దారు బి. వెంకటస్వామి అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వం వహించరాదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు కరీముల్లా, ఇన్‌చార్జ్ ఆర్‌ఐ యహేషవా, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'బంగారు కుటుంబాల' వివరాల సేకరణ

తాడికొండ(పొన్నెకల్లు), మే 7 (ఆంధ్రజ్యోతి): పొన్నెకల్లు గ్రామంలో అంబేడ్కర్ జయంతి వేడుకల సందర్భంగా పీ4 పథకం ద్వారా బంగారు కుటుంబాల ఎంపికపై.. డేటా నెట్‌వర్క్ ప్రతినిధులు వివరాలు సేకరించారు. డేటా నెట్‌వర్క్ చైర్మన్ ముప్పనేని కల్యాణ్ సహకారంతో 100 కుటుంబాలను దత్తత తీసుకుని వారి కుటుంబాలకు అండగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారు. డేటా నెట్‌వర్క్స్ వైస్ ప్రెసిడెంట్ స్వప్న, సీనియర్ మేనేజర్స్ రాంప్రసాద్, ధరణి, డిస్ట్రిక్ట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ జెట్టి సోల్‌రాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ మధుసూదన్, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షులు రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి జానీ పాల్గొన్నారు.

బహిరంగంగా మద్యం తాగితే కఠిన చర్యలు

వట్టిచెరుకూరు, మే 7(ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయాంలో ఆర్భాటంగా జగనన్న కాలనీల పేరుతో భూములు కొనుగోలు చేసి ఉన్న నేపథ్యంలో గృహ నిర్మాణాలు జరగక ముళ్ళ పొదలు పెరిగి అసాంఘిక కార్యకలాపాలకు పేకాట రాయుళ్ళకు అడ్డాగా మారాయనే వదంతుల నేపథ్యంలో ఎస్పీ ఆదేశాలతో డీఎస్పీ భానోదయ పర్యవేక్షణలో సీఐ రమా నాయక్ జగన్న కాలనీలపై ప్రత్యేక దృష్టిని సారించారు. ఈ నేపథ్యంలో బుధవారం మండలంలోని కొర్నెపాడు గ్రామ పంచాయతీ పరిధిలో అటు గుంటూరు వాసులకు, ఇటు మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారుల కోసం నిర్దేశించిన ప్లాట్లలో సీఐ రమానాయక్ సిబ్బందితో కలసి డ్రోన్ పర్యవేక్షణలో పరిసర ప్రాంతాలను చిత్రీకరించారు. సీఐ రమానాయక్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే తమకు క్షణాల్లో సమాచారం వస్తుందని, ఆయా ప్రాంతాల్లో డ్రోన్ నిఘా సహాయంతో చిత్రీకరించి ఆ చిత్రాల ఆధారంగా ఆయా వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నిర్మాణం సరే.. నగదు చెల్లింపులేవి..

● గోకులం బిల్లుల కోసం ఎదురుచూపు
● ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు
● చేసిన అప్పులకు భారమవుతున్న వడ్డీ

పెదనందిపాడు, మే 7 (ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్ల నిర్మాణాలు చేపట్టి నెలలు గడుస్తున్నా బిల్లులు అందక పాడిరైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమకు అధిక ప్రాధాన్యమిస్తూ గోకులం షెడ్డు నిర్మాణం, సబ్సిడీపై గేదెలు, మేకలు కొనుగోలుకు నిధులు కేటాయించింది. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిలిపివేయడంతో పశుపోషకులు పాడి పరిశ్రమ వైపు అంతగా మొగ్గు చూపలేదు. ఇటీవల కూటమి అధికారంలోకి వచ్చి పశు పెంపకదారులకు గోకులం షెడ్డు నిర్మాణం పథకాన్ని తిరిగి ప్రారంభించింది. వంద శాతం హెచ్‌ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరు చేసింది. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ పర్యవేక్షణలో గత సంవత్సరం అక్టోబరు నెలలో మండలంలో 41మంది లబ్ధిదారులను ఎంపిక చేసి అధికారులు గ్రౌండింగ్ చేసి లబ్ధిదారులతో వేగవంతంగా నిర్మాణ పనులు చేపట్టారు. ఆరు గేదెలు ఉండే గోకులం షెడ్డుకు ప్రభుత్వం రు.2.20లక్షలు మంజూరు చేసింది. వీటికోసం లబ్ధిదారులు పోటీపడి మరీ దక్కించుకున్నారు. బయట నగదును వడ్డీకి తెచ్చి సైతం నిర్మాణ పనులు చేపట్టారు. నెలలు గడుస్తున్నా బిల్లులు చెల్లింపులు జరపకపోవడంతో ఉపాధి కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరగాల్సి వస్తుందని, అధికారులు త్వరలో వస్తాయంటూ కాలం వెల్లబుచ్చుతున్నారే తప్ప తమ ఖాతాల్లో నగదు జమకాలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు దీనిపై చొరవ చూపి బిల్లులు మంజూరు చేయాలని కోరుతున్నారు.



అన్నవరంలో నిర్మించిన గోకులం షెడ్డు



అన్నపర్రులో నిర్మాణ దశలో ఉన్న షెడ్డు

నగదు చెల్లింపులు త్వరగా చేపట్టండి

● గేరా వెంకట్రావు, అన్నవరం, లబ్ధిదారుడు

గోకులం షెడ్డు నిర్మాణం పూర్తయింది. నగదు చెల్లింపులు చేయకపోవడంతో అప్పులు తెచ్చి నిర్మాణాలు పూర్తిచేశాం. వడ్డీల భారం ఎక్కువవుతుంది. వెంటనే బిల్లులు చెల్లించి ఆదుకోవాలి.

బుడంపాడు విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం

గుంటూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు టౌన్-1 డివిజన్ పరిధిలోని బుడంపాడు సబ్ స్టేషన్‌ను కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు బుధవారం ప్రారంభించారు. ముందుగా సబ్‌స్టేషన్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రూ.4.5 కోట్ల అంచనా వ్యయంతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ ప్రస్తుతం విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుతోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ నూతన సబ్‌స్టేషన్‌తో బుడంపాడుతో పాటు పరిసర ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందు బాటులోకి వస్తుందన్నారు. గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి, ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు మాట్లాడుతూ అన్నపూర్ణ కాంప్లెక్స్, బుడంపాడు బైపాస్, బుడంపాడు గ్రామం, సెయింట్ మేరీస్ వంటి నూతన ఫీడర్లు అందుబాటులోకి వస్తాయన్నారు. దాదాపు ఆరు నెలలకు పైగా ప్రారంభానికి నోచుకోకుండా ఉన్న బుడంపాడు సబ్ స్టేషన్‌పై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'బుడంపాడు సబ్‌స్టేషన్ ప్రారంభానికి గ్రహణం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది.



స్విచ్ ఆన్ చేసి సబ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే రామాంజనేయులు, ఎస్ఈ మూర్తి, ఈఈ శ్రీనివాసబాబు తదితరులు

కేఎల్‌యూకు జీఎస్‌డీసీ అక్రిడిటేషన్

తాడేపల్లి (వడ్డేశ్వరం), మే 7, (ఆంధ్రజ్యోతి): కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీకి గ్లోబల్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (జీఎస్‌డీసీ) అక్రిడిటేషన్ గుర్తింపును ఇచ్చినట్లు కేఎల్‌యూ స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేఎల్‌యూ మరో ముఖ్యమైన మైలురాయిని సాధించిందని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. గ్లోబల్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ యూఎస్‌ఏ, స్విట్జర్లాండ్, సింగపూర్‌లలో ఉన్న ఒక సర్టిఫికేషన్, అక్రిడిటేషన్ సంస్థ అని తెలిపారు. వర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖరరావు, ప్రో వైస్ చాన్సులర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, స్కిల్ డెవలప్ మెంట్ స్టూడెంట్ ప్రోగ్రెషన్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ హర్షం వ్యక్తం చేశారు.

పాక్ ఉగ్రవాద శిబిరాల ధ్వంసంపై హర్షం

మంగళగిరి, మే 7 (ఆంధ్రజ్యోతి): భారత వాయుసేన ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా పూర్తి చేయడంపై బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం మంగళగిరి నియోజకవర్గ బీజేపీ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. 9 ఉగ్రవాద స్థావరాలపై మెరుపు దాడి చేసి సురక్షితంగా భారతదేశానికి తిరిగి వచ్చిన భారత సైనికులకు, త్రివిధ దళాలకు, ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు మునగాల నాగేశ్వరరావు, నేతలు తుల్లిమిల్లి శ్రీనివాసరావు, వుద్దంటి రవికిరణ్, మునగపాటి వెంకటేశ్వరరావు, అందె శివశంకరరావు, కాండ్రు భాను కిషోర్, ఈశ్వరనాయుడు, మారెళ్ల సాంబశివరావు, జవ్వాది అమ్మయ్య చౌదరి, వాసం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ జెండాలను చేతబూని మిఠాయిలు పంచుకుని సంబరాలు నిర్వహించారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పూర్ణిమ లక్ష్మీ మాట్లాడుతూ ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో కుల మత, ప్రాంతాలకు అతీతంగా యావత్ భారతదేశం సైన్యానికి అండగా నిలవాలని పిలుపు నిచ్చారు. భారత సైన్యానికి, ప్రభుత్వానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన ఒక ప్రకటనలో అభినందనలు తెలియజేశారు.



బీజేపీ కార్యాలయం వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న నేతలు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

తాడేపల్లి (ప్రాతూరు), మే 7, (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ పిలుపునిచ్చారు. ప్రాతూరు రోడ్డులో బుధవారం ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులను కలిసి సమ్మెలో భాగం కావాలని కోరారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం 2019లో మోటార్ వాహనాల చట్టం సవరణ చేస్తూ అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు పెంచే విధంగా జీవో నంబరు 21 తీసుకొచ్చిందన్నారు. ఈ జీవోను సవరణ చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం సమస్యను పరిష్కరించలేదని విమర్శించారు. జీవో నంబరు 21 రద్దు చేయాలని నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెలో రవాణా రంగ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు నల్లపు గోపి, కార్యదర్శి చొక్కా బాలకృష్ణ, పాల్గొన్నారు.

నృసింహుని జయంతి ఉత్సవాలు ప్రారంభం



పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు, అర్చకులు

మంగళగిరి సిటీ, మే 7 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో ఈ నెల 12వ తేదీ వరకు జరుగనున్న నృసింహుని జయంతి ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. దిగువ సన్నిధిలోని శ్రీకృష్ణ దేవరాయ ముఖ మండపంలో బుధవారం సాయంత్రం భగవత్ ప్రార్థన ఆచార్య స్తోత్ర పఠనం, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రక్షా బంధనం, అంకురార్పణ తదితర పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు స్వర్గీయ మాల్యవంతం లక్ష్మీనరసింహాచార్యులు, శేషమ్మ కుటుంబసభ్యులు శాశ్వత కైంకర్యపరులుగా వ్యవహరించారు. రెండో రోజైన గురువారం ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ ప్రధాన అర్చకుడు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు తెలిపారు. దేవదాయశాఖ సహాయ కమిషనరు, ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మనమిత్ర వాట్సప్ క్యూఆర్ కోడ్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● ఎంపీపీ షేక్ జబీన్



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ జబీన్, ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు

దుగ్గిరాల, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఆవిష్కరించిన మనమిత్ర వాట్సప్ క్యూఆర్ కోడ్ వినియోగించి 200 రకాల సేవలను పొందవచ్చునని ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో కలిసి వాట్సప్ క్యూఆర్‌కోడ్‌ను బుధవారం ఆవిష్కంచారు. ఎంపీపీ మాట్లాడుతూ, ప్రజలు ప్రభుత్వ సేవలను పొందేందుకు అధికారిక వాట్సప్ నంబర్, క్యూఆర్‌కోడ్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అధికారులదేనని అన్నారు. అనంతరం మండలంలో జరుగుతున్న గృహ నిర్మాణాలు, జాతీయ ఉపాధిహామీ పనులపై సమీక్ష నిర్వహించారు. పీఎంఏవై 1.0లో మంజూరైన గృహాలను, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనంగా మంజూరైన నిధులతో ఇళ్లు త్వరగా పూర్తి చేసుకునేలా అధికారులు పనిచేయాలన్నారు. పీఎంఏవై 2.0 సర్వే లో ఇళ్లు కావాలని కోరిన లబ్ధిదారుల పేర్లను నమోదు చేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో జవహర్, గృహనిర్మాణ శాఖ ఏఈ సుబ్బారావు, పలువురు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు శ్రీకోదండరామాలయం పునఃప్రతిష్ఠ



పునఃప్రతిష్ఠకు సిద్ధమైన శ్రీకోదండరాముడి ఆలయం

దుగ్గిరాల, మే 7 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని యాదవపాలెంలో ఉన్న శ్రీ సీతాలక్ష్మణ హనుమత్ సమేత శ్రీకోదండ రామచంద్ర స్వామి ఆలయం పునఃప్రతిష్ఠ మహోత్సవం గురువారం నిర్వహించనున్నారు. మంత్రి నారా లోకేశ్ ఆలయ పునర్నిర్మాణం కోసం రూ.25లక్షలు అందించగా ఇటీవలే నిర్మాణం పూర్తి చేసుకుంది. మూడురోజులుగా జరుగుతున్న ప్రతిష్ఠా ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం 6గం.30ని.లకు పలువురు దంపతులచే శ్రీఉక్త హోమం నిర్వహించారు. టీటీడీ ఆగమ సలహాదారుడు శ్రీవిష్ణుభట్టాచార్య నేతృత్వంలో గురువారం విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, యంత్రారాధన, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

ముదివేడు నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

● వ్యవసాయ కార్మిక సంఘం నేతలు



సీసీఎల్‌ఏ అడిషనల్ కమిషనర్ ప్రభాకర్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వ్యకాస నేతలు

మంగళగిరి సిటీ, మే 7 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం అన్నమయ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మంగళగిరి ఆటోనగర్‌లోని సీసీఎల్‌ఏ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సీసీఎల్ఏ అడిషనల్ కమిషనర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని, పునరావాసం కల్పించాలని, లీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం బలవంతంగా రిజర్వాయర్ కోసం భూములు తీసుకుని పరిహారం ఇవ్వలేదన్నారు. కూటమి ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే సమస్యను పరిష్కరిస్తామని చెప్పి నేటివరకు పట్టించుకోలేదని విమర్శించారు. సమస్యలను పరిష్కరించకపోతే జూన్ 12వ తేదీ నుంచి నిరవధిక దీక్ష చేస్తామని, నిర్వాసితుల తరపున న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా అంకమ్మ, పోతురాజు స్వామి వార్షికోత్సవం

పిరంగిపురం, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొనుగుపాడు గ్రామంలో ఉన్న వినుకొండ అంకమ్మ, పోతురాజు స్వామి అష్టమ వార్షిక మహోత్సవం ఘనంగా జరపనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. 8వ తేదీ ఉదయం 7:30 గంటలకు అమ్మవారికి అలంకారం, హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాదా లు పంపిణీ జరుగుతుందన్నారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా జరుగుతుందన్నారు.

వైభవంగా బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవం

పెదనందిపాడు, మే, 7(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బ్రహ్మంగారి ఆరాధన వేడుకలు విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు.అనంతరం భజనా కార్యక్రమాలు చేశారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● కాకుమాను (ఆంధ్రజ్యోతి): కాకుమానులో వీర బ్రహ్మేంద్ర స్వామి వార్షిక కల్యాణం అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా జరిగింది. వార్షిక కల్యాణ మహోత్సవం సందర్భంగా సుప్రభాత సేవ, స్వామి వార్లకు అభిషేకం, వేద పండితులు నిర్వహించారు.

చిన్న జీయర్ ఆశ్రమంలో ఉడయవర్ల తిరునక్షత్రం



వెంకటాచార్య స్వామికి పురస్కారం అందిస్తున్న అహోబిల జీయర్ స్వామి

తాడేపల్లి టౌన్, మే 7, (ఆంధ్రజ్యోతి): త్రిదండి చిన్న జీయర్ స్వామి వారి మంగళ శాసనాలతో సీతానగరం జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆశ్రమంలో బుధవారం ఉభయ వేదాంత ప్రవర్తకాచార్యులు శ్రీమాన్ తూపురాణి ఉడయవర్లు స్వామి తిరునక్షత్ర మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ తిరునక్షత్ర మహోత్సవాన్ని పురస్కరించుకుని వైదికంగా ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించినటువంటి భాగవతోత్తములకు పురస్కార సమర్పణ మహోత్సవాన్ని ఏర్పాటు చేశారు. అందులో భాగంగా ఈ సంవత్సరం పురస్కార గ్రహీత కిడాంబి వెంకటాచార్య స్వామికి (నెల్లూరు) త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి, త్రిదండి అష్టాక్షరి రామానుజ జీయర్ స్వామి వార్లు, ఉడయవర్లు దేశిక పురస్కారాన్ని సమర్పించారు. కార్యక్రమంలో జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు, రఘునాధాచార్య స్వామి పాల్గొన్నారు.

మలినేని ఉమెన్స్‌లో రేపు మెగా జాబ్ మేళా



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, కళాశాల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు తదితరులు

వట్టిచెరుకూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పుల్లడిగుంట గ్రామ సమీపంలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఈనెల 9వ తేదీన ఏపీఎస్ఎస్‌డీసీ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు వెల్లడించారు. బుధవారం కళాశాలలో మెగా జాబ్ మేళాకు సంబంధించి కళాశాల చైర్మన్ పెరుమాళ్ళు, ఏపీఎస్ఎస్‌డీసీ అధికారులతో కలసి ఎమ్మెల్యే రామాంజనేయులు బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ ఈ మెగా జాబ్ మేళాలో 40కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని, సుమారు 1500 వందల మందికి ఉద్యోగ అవకాశాలు ఈ మేళాకు లక్ష్యంగా నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల చైర్మన్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగ అవకాశాలు కష్టతరంగా ఉన్న ఈ రోజుల్లో ఎమ్మెల్యే కృషి, ప్రభుత్వ చొరవతో మెగా జాబ్ మేళా నిర్వహించటం హర్షణీయమన్నారు. ఈ జాబ్ మేళాకు కళాశాలను వేదిక చేసుకోవటం సంతోషంగా ఉందన్నారు. సమావే శంలో ఎమ్మెల్యేతో పాటు చైర్మన్ మలినేని పెరుమాళ్ళు, మాజీ జడ్పీటీసీ జయలక్ష్మి, గింజుపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏషియన్ పోటీల్లో షానూన్‌కు 4 పతకాలు



షానూన్ మదిర

మంగళగిరి సిటీ, మే 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరుగుతున్న ఏషియన్ జూనియర్ క్లాసిక్ ఉమెన్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరు జిల్లాకు చెందిన పవర్ లిఫ్టర్ షానూన్ మదిర 47 కిలోల విభాగంలో నాలుగు పతకాలు సాధించింది. స్క్వాట్‌లో కాంస్య పతకం, బెంచిప్రెస్‌లో రజతం, డెడ్ లిఫ్ట్‌లో కాంస్యం, ఓవరాల్‌గా కాంస్య పతకాలను సొంతం చేసుకుంది. తెనాలికి చెందిన షానూన్ అంతర్జాతీయ పవర్ లిఫ్టర్, కోచ్ ఘట్టమనేని సాయిరేవతి వద్ద శిక్షణ పొందుతుంది. పతకాలు సాధించిన షానూన్‌ను రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సందాని తెలిపారు.

కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పెదనందిపాడు, మే 7(ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీకన్యకా పరమేశ్వర అమ్మవారి దేవస్థానంలో బుధవారం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అర్చకులు విశేష పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. వాసవీ చాలీసా పారాయణం 18 సార్లు చేశారు. 108 ప్రసాదాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం కోలాటాలతో స్వామిని గ్రామంలో ఊరేగించారు. అనంతరం అన్నదాన ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



కోలాటంతో అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం